# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202


తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 241 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 22 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 241 22-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## జపాన్ చరిత్రలో నవ శకం..

### తొలి మహిళా ప్రధానిగా 'ఐరన్ లేడీ' సనాయి తకాయిచి ఎన్నిక



**టోక్యో (జపాన్) :** జపాన్ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ప్రధానిగా సనే తకైచి ఎన్నికయ్యారు. ఈమె ఆ దేశానికి తొలి మహిళా కావడం విశేషం. పార్లమెంటులోని దిగువ సభ 465 ఓట్లలో తకైచి 237 ఓట్లను గెలుచుకున్నారు. దిగువ సభలో

- తరువాయి 2లో..



## రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్'..

### దీపావళి లేఖలో ప్రధాని మోదీ

- జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు వేల కోట్ల ఆదా
- స్వదేశీ వస్తువులనే వాడాలంటూ ప్రజలకు పిలుపు
- త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందన్న మోదీ


**న్యూఢిల్లీ అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** దీపావళి పర్వదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక లేఖ విడుదల చేశారు. శ్రీరాముడు ధర్మాన్ని నిలబెట్టడం నేర్పినట్టే, అన్యాయంపై పోరాడే స్ఫూర్తిని కూడా ఇస్తారని ఆయన పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఇందుకు ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని మోదీ వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన గౌరవాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా జరిగిన అన్యాయానికి ప్రతీకారం కూడా తీర్చుకుందని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం ప్రారంభమయ్యాక ఇది రెండో దీపావళి అని ప్రధాని గుర్తుచేశారు. ఈ దీపావళి చాలా ప్రత్యేకమైనదని ప్రధాని అభివర్ణించారు. దేశంలోని మారుమూల జిల్లాలతో సహా అనేక ప్రాంతాల్లో తొలిసారిగా దీపాలు వెలుగుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు నక్సలిజం, మావోయిస్టు ఉగ్రవాదంతో

- తరువాయి 2లో..

## శాంతిభద్రతలు ఉంటేనే.. పెట్టుబడులు సాధ్యం

- పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది
- పోలీసుల గౌరవం పెంచుతాం...వారి కుటుంబాల సంక్షేమం భాధ్యత మాదే
- సోషల్ మీడియా నేరాలు పోలీసుశాఖకు ఓ సవాలు
- రాజకీయ ముసుగులో చేసే నేరాలను కట్టడి చేయాలి
- మంగళగిరిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ లాంటి దిగ్గజ ఐటీ సంస్థ ఆంధ్రప్రదేశ్ కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. వాటిని సంరక్షించటంలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషించాలని సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా దళాల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించారు. పోలీసు సంస్మరణ దినం ఫ్లాగ్ ధరించి.. ఫ్లాగ్ ఫండ్ కు విరాళం ఇచ్చారు. పోలీసుల గౌరవం పెంచటంతో పాటు వారి కుటుంబాల





సంక్షేమం చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని.. దానికి మరింత వన్నె తెచ్చేలా పని చేయాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసులను ఉద్దేశించి ప్రసంగించిన సీఎం "దేశంలో శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. 1959 అక్టోబర్ 21న చైనాపై వీరోచిత పోరాటంలో సీఆర్పీఎఫ్ కు చెందిన 10 మంది జవాన్లు అమరులయ్యారు. వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏటా అక్టోబర్ 21న,

- తరువాయి 2లో..

## లక్ష్మీనాయుడు కుటుంబానికి భారీ పరిహారం

- ప్రకటించిన సీఎం చంద్రబాబు
- లక్ష్మీనాయుడు భార్యకు 2 ఎకరాలు, ఇద్దరు పిల్లలకు చెరో 2 ఎకరాల భూమి కేటాయింపు
- కుటుంబ సభ్యులకు నగదు సాయం, పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వానిదే
- గాయపడిన వారికి కూడా భూమి, ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడి
- కేసు విచారణ వేగవంతం చేసేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆదేశం
- కందుకూరు నియోజకవర్గంలో హత్య ఘటనపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలో జరిగిన లక్ష్మీనాయుడు హత్యోదంతంపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ భారీ ఆర్థిక సహాయంతో పాటు భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించి నిందితులపై కఠిన చర్యలు తప్పవని, విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలో

- తరువాయి 2లో..

## శ్రీవారికి వెల్లువెత్తిన విరాళాలు...

- టీటీడీ ట్రస్టులకు రికార్డు స్థాయిలో విరాళాలు
- 11 నెలల్లోనే రూ. 918.6 కోట్ల భారీ కానుకలు
- అన్నప్రసాదం ట్రస్టుకే అత్యధికంగా రూ. 338 కోట్లు
- ఆన్‌లైన్ ద్వారానే అధికంగా రూ. 579 కోట్ల విరాళాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పెరుగుతున్న దాతల సంఖ్య




**తిరుమల, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** తిరుమల శ్రీవారి భక్తులు తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే వివిధ ట్రస్టులకు గత 11 నెలల కాలంలో రికార్డు స్థాయిలో విరాళాలు వెల్లువెత్తాయి. 2024 నవంబర్ 1 నుంచి 2025 అక్టోబర్ 16వ తేదీ వరకు ఏకంగా రూ. 918.6 కోట్లు విరాళాలుగా అందినట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. ఈ విరాళాల్లో సింహభాగం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకే దక్కింది. ఈ ఒక్క ట్రస్టుకే అత్యధికంగా రూ. 338.8 కోట్లు అందడం విశేషం. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీవాణి ట్రస్టుకు రూ. 252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ. 97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ. 66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ. 56.77 కోట్ల చొప్పున

- తరువాయి 2లో..

## ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..

- వెస్టర్న్ సిడ్నీ వర్సిటీతో మంత్రి లోకేశ్ చర్చలు
- ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేశ్
- ఏపీ వ్యవసాయ ఆధునికీకరణకు సహకరించాలని వర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి
- వాతావరణాన్ని తట్టుకునే పంటలు, స్మార్ట్ ఫార్మింగ్‌పై కలిసి పనిచేయాలని ప్రతిపాదన
- ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీతో భాగస్వామ్యం కావాలని సూచన
- ఏఐ, స్మార్ట్ ఇరిగేషన్ టెక్నాలజీలపైనా చర్చలు
- రైతులకు శిక్షణ ఇచ్చేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలని కోరిన మంత్రి







**ఆస్ట్రేలియా అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి, రైతులను బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రఖ్యాత వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీని (డబ్ల్యూఎస్‌యూ) సందర్శించి, వర్సిటీ సీనియర్ ప్రతినిధులు, వ్యవసాయ టెక్నాలజీ పరిశోధకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఏపీ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు తమతో కలిసి పనిచేయాలని లోకేశ్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో

- తరువాయి 2లో..

## ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకరించండి


### పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్ తో మంత్రి లోకేష్ భేటీ



**ఆస్ట్రేలియా (సిడ్నీ):** గ్రేటర్ సిడ్నీలో కీలక నగరం పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పారమట్టాలో స్థానిక వ్యాపారాలను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించి గ్లోబల్ సిటీగా మార్చడంలో జైటర్ కృషిని మంత్రి లోకేష్ ప్రశంసించారు. ప్రజారవాణా, గ్రీన్ స్పేసెస్‌ను

- తరువాయి 2లో..

## అల్పపీడనం - నేటి నుండి 3 రోజులు వానలు




**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** నైరుతి రుతుపవనాలు వెళ్లినప్పటికీ ఈశాన్య రుతుపవనాల రాకతో దేశవ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. వీటికితోడు ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నేడు అల్పపీడనంగా మారనుంది. దీని కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వానలు దంచికొడుతున్నాయి. మంగళవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నేటి నుంచి వరుసగా

- తరువాయి 2లో..

## కోనసీమ ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్..

## మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు పరిహారం

- కోనసీమ బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలని ఆదేశం
- తయారీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, కార్మికులకు బీమా తప్పనిసరి
- అనధికార యూనిట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివద్దని స్పష్టం



**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** కోనసీమ జిల్లాలో జరిగిన ఘోర బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో హోంమంత్రి అనిత, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై కీలక

- తరువాయి 2లో..

## భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..

- నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం
- భీమవరం డీఎస్పీ జయసూర్యపై పవన్‌కు ఫిర్యాదులు



**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారశైలిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. డీఎస్పీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్పీని ఆయన ఆదేశించారు. భీమవరం డీఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ఆయన నేరుగా సివిల్

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## పశ్చిమాసియా పరవశం!

ఇప్పుడక్కడ తుపాకీ పేలుళ్లు, మిస్సైళ్ల గర్జనలు వినపడవు. కనపడేవన్నీ ఉద్వేగ్న సన్నివేశాలు. ఆత్మీయ పలకరింపుల మధ్య ఇజ్రాయెలీ బందీల ఆనందబాష్పాలు, హమాస్ చెర నుంచి విడుదలైన ఇజ్రాయెలీలు కాని, ఇజ్రాయెల్ విడుదల చేసిన 1968 మంది పాలస్తీనియన్లు ఒక్కసారిగా ఇలాంటి మధురక్షణాలను చవి చూశారు. ఇంతకాలం బందీలుగా నాలుగు గోడల మధ్య ఇక చివరి రోజులేననుకున్న తరుణంలో ఒక్కసారిగా వారిలో కాంతిరేఖ ప్రసరించింది. పశ్చిమాసియా లోనవోదయం వెలుగు చూసింది. 738 రోజులు చీకట్లో మగ్గినవారు ఇప్పుడు స్వేచ్ఛాజీవులు. పశ్చిమాసియా లో శాంతికపోతాలు ఎగురుతున్నాయనడానికివే సాక్షీభూతాలు. ఈసారి యుద్ధవిరమణ తంత్రంలో శ్వేతసౌధాధినేత ట్రంప్దే పైచేయి. ఎవరేమనుకున్నా హమాస్, ఇజ్రాయెల్ల మధ్య సంధి కుదర్చడమంటే మాటలు కాదు. ఇరుపక్షాల వారు ఒకరిపై ఒకరు రగిలిపోతున్నారు. వారి మధ్య కుదిరిన శాంతి ఒప్పందాలలో భాగంగా తొలిదశలో ఇరుపక్షాలు సోమవారం బందీలను పరస్పరం విడుదల చేశాయి. సజీవంగానైనా, నిర్జీవంగానైనా సరే 'మా వాళు మాక్కావాలన్న' ధోరణిలో ఇజ్రాయెల్ పట్టుపట్టడంతో తొలి విడతగా తమ ఆధీనం లో ఉన్న 20మందిని సజీవంగా గాజా మూడు ప్రాంతాల నుంచి రెడ్ క్రాస్ సంస్థకు అప్పగించింది. పాలస్తీనా ఖైదీల విడుదల ప్రక్రియ కూడా సజావుగానే సాగింది. ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్న వెస్ట్ బ్యాంక్ లోని పలు జైళ్లలో బందీగా ఉన్న పాలస్తీనియన్లు తమ ఆత్మీయులను కలుసుకోగలరు. ఈ శాంతి ఒప్పందం అమలయ్యే వరకు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెలీలు కాని, ఇటు వెస్ట్ బ్యాంక్లో మగ్గుతున్న పాలస్తీనియన్లు కానీ తాము సజీవంగా బయటపడతామని ఏనాడూ అనుకోలేదు. ఇక మానవతాసాయం కూడా అనుకున్నట్లుగానే ఏర్పాట్లు జరిగాయి. గాజా పునర్నిర్మాణానికి సహాయం చేస్తామని, పాలస్తీనీయులు ఉగ్రవాదాన్ని, హింసను వదిలిపెట్టాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హమాస్ను హెచ్చరిస్తూనే ఉగ్రవాదంపై ఇజ్రాయెల్ విజయం సాధించినట్లు ప్రకటించారు. ఇరుపక్షాల మధ్య శాంతి ఒప్పందం అమలు, సయోధ్యకు సంపూర్ణ స్థాయిలో సిద్ధం చేయడం వంటి అంశాల పర్యవేక్షణకు ట్రంప్ స్వయంగా ఈజిప్టుకు హాజరవడం విశేషించదగినది. ట్రంప్ మధ్యవర్తిత్వానికి కృతజ్ఞతగా ఈజిప్ట్ పార్లమెంట్లో ఆయనకు సభ్యులంతా నిలబడి ఒక్కసారిగా చప్పట్లు కొట్టారు. అదే అత్యున్నత గౌరవం.ఇది చరిత్రలోనే లిఖించదగిన విషయం. గాజా స్ట్రిప్పు మరుభూమిగా మార్చిన రెండేళ్ల యుద్ధానికి ఎలాగైతేనేం తెరపడింది. అది తాత్కాలికమా? శాశ్వతమా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. కాలమే నిర్ణయిస్తుంది. పాలస్తీనా ప్రాంతానికి చెందిన పాలస్తీనియన్లు విడుదలై ఊపిరి పీల్చుకుంటున్నారు. తమ తమ ఇళ్లకు చేరుకునే సరికి అవి శిధిలమై, కూలిన భవనాలను, కూల్చిన ఇళ్లను చూసుకుని బావురుమంటున్నారు. గాజా, ఇజ్రాయెల్ల మధ్య తుదిఒప్పందాలు కుదిరి అమల్లోకి వచ్చేవరకు శాంతిని నెలకొల్పడానికి తాను కట్టుబడి ఉంటానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా ప్రకటించడమే ఈ ఒప్పంద సారాంశం. నెతన్యాహు ఎంతకైనా తెగిస్తాడని ప్రతీతి. అతనే స్వీయనిర్ణయాన్ని నిర్ద్వందంగా ప్రకటించారని హమాస్ నేతలు నమ్మి ముందుకు రావడం అటుఇటూ ఇరుపక్షాలను శాంతిమార్గంలో పయనింప చేసేందుకు మార్గం సుగమమయ్యింది. ఇక ముందు గాజాను నిస్సైనికీకరణ చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ శాంతి ఒప్పందాల నేపథ్యం కనపడుతోంది. ఎవరెంతగా పోరాడారు. ఎవరి లక్ష్యాలు ఏమిటి? ఎవరు విజతలయ్యారు నేది ట్రంప్ చెప్పినంత సులభం కాదు. ఇరువర్గాలు భారీ గానే నష్టపోయాయి. జననష్టం, ఆస్తినష్టాల విషయానికొస్తే ఇజ్రాయెల్ దాడుల్లో 67,800 మంది చనిపోయారు. వారిలో సగం మందికి పైగా మహిళలు, చిన్నారులే. ఇప్పటి శాంతి ఒప్పందంతో తమసొంత ప్రాంతాల్లోనే బందీలుగా ఉన్న పాలస్తీనియన్లకు స్వేచ్ఛ వచ్చినందుకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియోగుటెరస్ ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. యుద్ధాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇకపై గాజా స్ట్రిప్ ఇజ్రాయెల్లు శాంతి ధామాలని ట్రంప్ స్వయంగా ప్రకటించారు.అంతే తప్ప ఈ దేశాల మధ్య యుద్ధానికి ప్రధాన కారణమైన 'పాలస్తీనా అంశంపై ట్రంప్ ఏమీ మాట్లాడలేదు. దీనిపై ఎలాంటి ఒప్పందమూ జరుగలేదు. కాల్పుల విరమణ అన్నది ప్రధానాంశం. అయితే గాజా పునర్నిర్మాణం కోసం సుమారు రూ.4.7 లక్షల కోట్లఅవసరమౌతుందన్న అంచనాలు వేశారు. అన్నీ ఇజ్రాయెల్ నేతృత్వంలోనే జరుగుతాయన్నది సుస్పష్టం. కాగా "హమాస్' దళాలకు ఎలాంటి పని చెప్పకుండా గాజాలో పాలస్తీనా భద్రతా దళాల్ని ఏర్పాటు చేయమన్నారు. అంటేపాలస్తీనా సమస్యకు పరిష్కారం లభించనట్లే! ప్రత్యేక 'పాలస్తీనా' ఏర్పాటు అన్నది హమాస్ ఆకాంక్ష, శాంతి ఒప్పందాలు స్వాగతించదగినవే. ఇరుపక్షాలు శషభిషలు లేకుండా వాటి అమలు చేయడమూ మంచిదే. గాజా అంటే అతిచిన్న ప్రాంతం. ఈ యుద్ధంలో పరమ కిరాతంగా ఊచకోతకోసిన చరిత్ర ఇజ్రాయెల్దే. ఒకనాటి ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు 56 శాతం భూభాగం ఇజ్రాయెల్కి కాగా 43 శాతం భూభాగం పాలస్తీనాకివ్వాలి. కానీ నిన్న మొన్నటి యుద్ధంలో ఇజ్రాయెల్ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుంది. పాలస్తీనా ప్రజల్లో అశాంతికి మూలకారణమయ్యింది. ఈ వివాదాలు ముగిసి పాలస్తీనాకు స్వతంత్ర దేశంగా గుర్తించబడినప్పుడే అక్కడ పూర్తిస్థాయి శాంతి నెలకొల్పినట్లవుతుంది. దానికోసం ఎదురు చూడాల్సిందే.

## జపాన్ చరిత్రలో నవ శకం..
### తొలి మహిళా ప్రధానిగా 'ఐరన్ లేడీ' సనాయి తకాయిచి ఎన్నిక

జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్లో కాన్స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు యోషిహికో నోడాకు 149 ఓట్లు రాగా, ఎల్డిపి పార్టీ అభ్యర్థి తకైచి 237 ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె ప్రధాని మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జపాన్ న్యూస్ ఏజెన్సీ క్యోడో తెలిపింది.కాగా, ప్రధానిగా తకైచి ముందు అనేక సవాళ్లున్నాయి. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, అవినీతి కుంభకోణాలు, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు%ా% ఇన్ని సవాళ్ల మధ్య సనై తకైచి ప్రధాని బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.


## రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్'..

అట్టుడికిన ఈ ప్రాంతాలు ఇప్పుడు పూర్తిగా ప్రశాంతంగా మారాయని అన్నారు. హింసా మార్గాన్ని వీడిన ఎందరో మన రాజ్యాంగంపై విశ్వాసంతో అభివృద్ధి స్రవంతిలో కలుస్తున్నారని, ఇది దేశానికి గొప్ప విజయమని మోదీ పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక సంస్కరణలను కూడా మోదీ ప్రస్తావించారు. నవరాత్రుల తొలి రోజు నుంచే తగ్గిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని, 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ద్వారా ప్రజలు వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. పలు సంక్షోభాలతో ప్రపంచం అస్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ స్థిరత్వానికి చిహ్నంగా నిలిచిందన్నారు. సమీప భవిష్యత్తులోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించాలని మోదీ పిలుపునిచ్చారు. స్వదేశీ ఉత్పత్తులను స్వీకరించి, 'ఇది స్వదేశీ!' అని గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని పెంపొందించాలని, అన్ని భాషలను గౌరవించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించుకుని, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని హితవు పలికారు. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినప్పుడు దాని కాంతి తగ్గదని, ఇంకా పెరుగుతుందని దీపావళి మనకు నేర్పుతుందని మోదీ అన్నారు. అదే స్ఫూర్తితో సమాజంలో సామరస్యం, సహకారం, సానుకూలత అనే దీపాలను వెలిగిద్దామని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## శాంతిభద్రతలు ఉంటేనే.. పెట్టుబడులు సాధ్యం







పోలీస్ అమర వీరుల దినాన్ని నిర్వహించుకుంటున్నాం. వారి త్యాగాలను, బలి దానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నాం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. వీరికి నివాళులు అర్పిస్తున్నాను. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులు అంటే నాకెప్పుడూ గౌరవం. పోలీసులు చేసేది ఉద్యోగం కాదు..నిస్వార్థ సేవ." అని అన్నారు.

**ఈగల్- శక్తి బృందాలతో ఆదర్శంగా ఏపీ పోలీస్ శాఖ**

"శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అప్పుడే సంక్షేమం అందరికీ అందుతుంది. ఉపాధి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అప్పుడే కుటుంబంలో, సమాజంలో సుఖ శాంతులు ఉంటాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమాజంలో అలజడి ఉంటే పెట్టుబడులు రావు. అందుకే నేను ఎప్పుడూ లా అండ్ ఆర్డర్ పై ఖచ్చితంగా ఉంటాను. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతో పరిశ్రమలు, కంపెనీలు వస్తాయి. అదే నమ్మకంతో విశాఖలో గూగుల్ పెట్టుబడులు పెట్టింది. విశాఖలో గూగుల్ పెడుతున్న పెట్టుబడులు దేశంలోనే అతి పెద్ద పెట్టుబడి. 15 బిలియన్ డాలర్లతో ఏఐ డేటా హబ్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది. అప్పుడే ఏపీ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుంది. ఏపీ పోలీసులు అంటే ఒక బ్రాండ్. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంను అణిచి వేయడంలో ఏపీ పోలీసులు ఎంతో పేరు తెచ్చుకున్నారు. పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. సిద్ధాంతం పేరుతో, ఆధిపత్యం కోసం, డబ్బుల కోసం నేరాలు చేసే వారు ఉన్నారు. ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట పడాలి. నేరాల తీరు మారుతోంది. క్రిమినల్స్ అప్ డేట్ అవుతున్నారు. వారి ఆట కట్టించాలంటే పోలీసు శాఖ కూడా అప్డేట్ అయి ఉండాలి. అందుకే సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్... ఇలా టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ప్రతీ 50 మీటర్లకి ఒక సీసీ కెమేరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీస్ యంత్రాంగానికి మూడో కన్నులా పనిచేస్తుంది. ఎవరు ఎక్కడ ఏ తప్పు చేసినా రికార్డెడ్గా పట్టుకునే వీలు కలుగుతుంది. టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ, అధునాతన పోలీస్ స్టేషన్లు, ఈగల్ , శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రోన్లతో గంజాయి పంటను గుర్తించి ధ్వంస చేస్తున్నారు. స్మగ్లింగ్ను అరికడుతున్నారు. అడవుల్లో డ్రోన్లు ఎగరేసి ఎర్ర చందనం దొంగలను కట్టడి చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసు శాఖకు అభినందనలు. డబ్బుల కోసం రౌడీయిజం చేసే ముఠాలుగా మారుతున్న వారిని కట్టడి చేయాలి. తప్పు చేసే వారికి పోలీస్ అంటే భయం ఉండాలి. అప్పుడే నేరాలు తగ్గుతాయి." అని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ ముసుగు వేసుకుని వస్తున్నారు "సమాజంలో అశాంతి సృష్టించి...లబ్ది పొందడం కోసం రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు తయారయ్యారు . వీళ్లు అసలు క్రిమినల్స్ కంటే ప్రమాదం. మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు. సమాజంలో అశాంతిని సృష్టించడానికి రాజకీయ కుట్రలు చేస్తున్నారు. ఫేక్ ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో పోలీసులు మరింత అలెర్ట్ గా ఉండాలి. పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని మతాల మధ్య చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. దీనికి రాజకీయాన్ని జోడించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో సీసీ కెమెరాలతో వాస్తవాలు బయట పెట్టగలిగాం. జీడీ నెల్లూరు మండలంలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి వేరే వారిపై నెపం నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు. సీసీ టీవీలు ఉండటంతో నేరస్తులు దొరికారు. లేదంటే జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని రచ్చ చేసేవారు. కల్తీ మద్యంపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దోషులు ఏ పార్టీ వారైనా చర్యలు తీసుకోవాలని చెప్పాం. రాష్ట్రంలో ఎవరు చనిపోయినా మద్యంతోనే అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న దుష్ప్రచారం, నేరాలు పోలీసులకు అతి పెద్ద ఛాలెంజ్. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో పెట్టే అసభ్యకర పోస్టుల విషయంలో చాలా మంది కుమిలిపోతున్నారు. శాంతి భద్రతలకంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఆడబిడ్డలపై అరాచకం చేస్తే.. అదే చివరి రోజు అనిపించేలా పోలీసులు కఠినంగా ఉండాలి. ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి.. ప్రభుత్వం పోలీసులకు అండగా ఉంటుంది." అని సీఎం స్పష్టం చేశారు.









**పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం**

"ఆధునికీకరణలో టెక్నాలజీలో పోలీస్ శాఖ ముందుండాలి. నూతన పాలసీలు తీసుకొచ్చాం. గ్రేహౌండ్స్ ను చాలా పటిష్టంగా తయారు చేశాం. రౌడీయిజం చేయాలనుకున్న వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించాం. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడాలి. నేరాల కట్టడి విషయంలో కఠినంగా వ్యవహరించాలి. శాంతి భద్రతల విషయంలో నేను ఏనాడూ రాజీపడలేదు. అందుకే నా పై నక్సలైట్లు క్లైమోర్ మైన్లతో దాడి చేశారు. మనం చేసే పనులే శాశ్వతం. మంచి పనులు చేస్తున్న పోలీస్ శాఖను అభినందిస్తున్నా. పోలీసుల వైద్య సేవలకు 16 నెలల్లో రూ.33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లు అందించాం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నాం. ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయించాం. పోలీస్ సోదరులకు ఒక సరెండర్ లీవ్ రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ నియామకాలను పూర్తి చేశాం. శాఖాపరమైన పదోన్నతులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యం కావాలి. దీనికి శాంతి భద్రతలు చాలా ముఖ్యం. విపత్తులు, కరోనా లాంటి మహమ్మారి వంటివి వచ్చినా... ముందుండి ప్రజల కోసం పోలీసులు మొదటి అడుగులు వేశారు. పోలీసులు తమ విధుల కోసం కుటుంబాన్ని సుఖ సంతోషాలను త్యాగం చేస్తున్న పోలీస్ కుటుంబాలకు నమస్కారాలు."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీనాయుడు కుటుంబానికి భారీ పరిహారం

ముఖ్యమంత్రి చంద్రబాబు శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హోంమంత్రి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, లక్ష్మీనాయుడి హత్యను అమానుషమైన, దారుణమైన చర్యగా అభివర్ణించారు. "ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. ఈ సమీక్ష అనంతరం ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పరిహార వివరాలను వెల్లడించింది. లక్ష్మీనాయుడి భార్యకు రెండు ఎకరాల భూమితో పాటు రూ. 5 లక్షల నగదు సాయం అందించనున్నారు. అంతేగాకుండా, ఆయన ఇద్దరు పిల్లల పేరు మీద చెరో రెండు ఎకరాల భూమి, తలా రూ. 5 లక్షల చొప్పున ఫిక్స్డ్ డిపాజిట్ చేయాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే పూర్తిగా స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ దాడిలో గాయపడిన పవన్కు నాలుగు ఎకరాల భూమి, రూ. 5 లక్షల నగదు, మరో ముఖ్య సాక్షిగా ఉన్న భార్గవ్కు రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. పరిహార పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతలను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు చేసి, దోషులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన ఆదేశించారు.

## శ్రీవారికి వెల్లువెత్తిన విరాళాలు...

భక్తులు కానుకలు సమర్పించారు. ఆసక్తికరంగా భక్తులు నేరుగా విరాళాలు అందించడం కన్నా ఆన్లైన్ ద్వారానే ఎక్కువగా తమ విరాళాలను అందిస్తున్నారు. మొత్తం విరాళాల్లో ఆన్లైన్ ద్వారా రూ. 579.38 కోట్లు రాగా, ఆఫ్లైన్ ద్వారా రూ. 339.20 కోట్లు అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీకి విరాళాలు అందించే దాతల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాతలకు గౌరవం, సదుపాయాలు కల్పించాలని, వారి విషయంలో ఎలాంటి లోటుపాట్లు రాకూడదని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. కేవలం నగదు రూపంలోనే కాకుండా, పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి కూడా దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నారని, రానున్న రోజుల్లో విరాళాలు మరింత పెరిగే అవకాశం ఉందని టీటీడీ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..

కలిసి పనిచేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల అభివృద్ధి, ప్రెసిషన్ ఫార్మింగ్ వంటి రంగాల్లో మీ నైపుణ్యాన్ని మా రైతులకు అందించాలి" అని కోరారు. స్మార్ట్ ఫార్మింగ్, అగ్రి-టెక్ ఆవిష్కరణలపై రైతులకు, వ్యవసాయ నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్మార్ట్ నీటిపారుదల వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ఇన్నోవేషన్ హబ్ల ఏర్పాటులో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో స్థిరమైన వ్యవసాయ విధానాల రూపకల్పనకు పరిశోధన ఆధారిత సూచనలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై వర్సిటీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తమ విశ్వవిద్యాలయం స్థిరమైన అభివృద్ధిలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని (THE Impact Rankings 2023), ప్రపంచంలోని టాప్ 2 శాతం విశ్వవిద్యాలయాలలో ఒకటిగా గుర్తింపు పొందిందని వారు వివరించారు. ఇప్పటికే ఐఐటీల వంటి భారతీయ సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. తమ అనుబంధ సంస్థ హాక్స్బరీ ఇన్స్టిట్యూట్ ఫర్ ద ఎన్విరాన్మెంట్... భూసారం, నీటి యాజమాన్యం వంటి అంశాలపై విస్తృత పరిశోధనలు చేస్తోందన్నారు. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT) టెక్నాలజీలను ఉపయోగించి పంట దిగుబడులను పెంచడంపై దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకరించండి

అభివృద్ధి చేయడంలో చొరవ చూపిన జైటర్, పారమట్టా స్క్వేర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. గత 20 సంవత్సరాలుగా లోకల్ గవర్నెన్స్, కమ్యూనిటీ డెవలప్ మెంట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సార్టప్ స్టేట్ గా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం హారిస్ పార్కులో లిటిల్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన రివర్ సైడ్ ఫుడ్ కోర్టును సందర్శించారు.

## అల్పపీడనం - నేటి నుండి 3 రోజులు వానలు

3 రోజులు రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షం కురవనుంది. మిగిలిన జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప బయటకు రావొద్దంటూ వాతావరణ అధికారులు సూచించారు. మరోవైపు %ా% బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధ వారాల్లో తెలంగాణలోని అన్ని జిల్లాలలో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలో ఈ రోజు, రేపు తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి ఉరుములతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

## కోనసీమ ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్.. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు పరిహారం

ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు ఘటనపై రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు. ప్రమాదం జరిగిన యూనిట్లో నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారని నివేదికలో స్పష్టం చేశారు. ఒకే షెడ్డులో 14 మంది కార్మికులు ముడి పదార్థాలను తయారు చేస్తున్నారని, కఠినమైన మెటీరియల్ వాడటం వల్ల స్పార్క్ వచ్చి పేలుడు సంభవించిందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, బాణసంచా తయారీ కేంద్రాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రతి తయారీ కేంద్రంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముడి పదార్థాల కొనుగోళ్లను ఇకపై ఆన్లైన్ ద్వారానే జరపాలని, దీనివల్ల పారదర్శకతతో పాటు నియంత్రణ కూడా ఉంటుందని సూచించారు. నిబంధనలు పాటించని, అనధికారికంగా నడుస్తున్న యూనిట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిర్వాహకులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని తేల్చిచెప్పారు. అంతేకాకుండా, లైసెన్సులు జారీ చేసే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సీఎం సూచించారు. పనిచేసే ప్రతీ కార్మికుడికి వ్యక్తిగత బీమా సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.


## భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..

వివాదాల్లో తలదూరుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి పలు ఫిర్యాదులు అందాయి. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి నేతల పేర్లను వాడుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పవన్ కల్యాణ్ నేరుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ, డీఎస్పీ జయసూర్య పనితీరుపై నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సివిల్ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా, భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణల విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, డీజీపీ దృష్టికి కూడా తీసుకెళ్లాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# అంధులకు చూపు...

## అద్భుతం సృష్టిస్తున్న కొత్త టెక్నాలజీ!

- శాశ్వత అంధులకు చూపు తెప్పిస్తున్న 'ప్రిమా' అనే వైర్‌లెస్ ఇంప్లాంట్
- వృద్ధాప్య అంధత్వంతో బాధపడుతున్న వారిపై విజయవంతమైన ప్రయోగాలు
- క్లినికల్ ట్రయల్స్‌లో 80 శాతానికి పైగా సానుకూల ఫలితాలు
- పరికరం సాయంతో అక్షరాలు, పుస్తకాలు చదువుతున్న బాధితులు
- వైద్య చరిత్రలో ఇదొక అద్భుతమైన విజయమన్న పరిశోధకులు
- ప్రత్యేక కళ్లద్దాలు, కంటిలోని చిప్ ద్వారా పనిచేసే టెక్నాలజీ



శాశ్వత అంధత్వంతో బాధపడుతున్న లక్షలాది మందికి వైద్య శాస్త్రం సరికొత్త ఆశను చూపిస్తోంది. వయసు పెరగడం వల్ల వచ్చే తీవ్రమైన కంటి సమస్య (ఏజ్-రిలేటెడ్ మాక్యులార్ డీజెనరేషన్ - AMD) కారణంగా పూర్తిగా చూపు కోల్పోయిన వారికి సైతం మళ్లీ దృష్టిని ప్రసాదించే ఒక వైర్‌లెస్ రెటీనా ఇంప్లాంట్ అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. 'ప్రిమా' (PRIMA) అనే ఈ పరికరం సాయంతో అంధులు సైతం ఇప్పుడు అక్షరాలను, పదాలను చదవగలుగుతున్నారు. సోమవారం వెలువడిన క్లినికల్ ట్రయల్స్ ఫలితాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా వృద్ధులు ఏఎండీ కారణంగా శాశ్వత అంధత్వంతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి చికిత్స అందించేందుకు యూనివర్సిటీ కాలేజ్ లండన్, పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ మెడిసిన్ పరిశోధకులు సంయుక్తంగా ఈ 'ప్రిమా' పరికరాన్ని అభివృద్ధి చేశారు. దీనిపై నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా, 32 మంది రోగులకు ఈ పరికరాన్ని అమర్చారు. ఏడాది తర్వాత పరిశీలించగా, వారిలో 27 మంది అక్షరాలను స్పష్టంగా చదవగలిగినట్లు తేలింది. ఈ పరికరం పనితీరు చాలా ప్రత్యేకంగా ఉంటుంది. రోగికి ప్రత్యేకమైన కళ్లద్దాలు ఇస్తారు. వాటికి ఒక చిన్న కెమెరా అమర్చి ఉంటుంది. కంటిలోని రెటీనాలో 2%ఇ%2 మిల్లీమీటర్ల వైర్‌లెస్ చిప్‌ను (ఇంప్లాంట్) అమర్చుతారు. కళ్లద్దాల కెమెరా బయటి దృశ్యాలను చిత్రీకరించి, ఆ సమాచారాన్ని ఇన్‌ఫ్రారెడ్ కాంతి రూపంలో కంటిలోని చిప్‌పైకి పంపుతుంది. ఆ చిప్ కాంతిని విద్యుత్ సంకేతాలుగా మార్చి, రెటీనాలోని మిగిలిన కణాలను ఉత్తేజపరిచి, ఆ సమాచారాన్ని మెదడుకు చేరవేస్తుంది. తద్వారా రోగి దృశ్యాలను చూడగలుగుతారు. ఈ పరిశోధన ఫలితాలపై పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ ఆప్తమాలజీ విభాగం ఛైర్మన్ జోస్-అలైన్ సాహెల్ మాట్లాడుతూ, "చూపును తిరిగి తెప్పించే ప్రయత్నంలో ఇంత పెద్ద సంఖ్యలో రోగులపై ఇలాంటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారి. 80 శాతానికి పైగా రోగులు అక్షరాలు, పదాలు చదవగలుగుతున్నారు. వారిలో కొందరు పుస్తకంలోని పేజీలను కూడా చదువుతున్నారు" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ అధ్యయన వివరాలను ప్రఖ్యాత 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' ప్రచురించింది. ప్రయోగాల్లో పాల్గొన్న వారిలో 84 శాతం మంది తమ రోజువారీ పనులకు ఈ కృత్రిమ దృష్టిని వాడుతున్నట్లు తెలిపారు. ఒక రోగి ఏకంగా 12 లైన్ల వరకు చదవగలిగేలా దృష్టిని మెరుగుపరచుకోవడం విశేషం.

## పెట్టుబడుల వేటలో

# సీఎం చంద్రబాబు..

- యూఏఈ పర్యటన
- దుబాయ్, అబుదాబి, యూఏఈలో పర్యటించనున్న సీఎం
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు పెట్టుబడుల సేకరణే లక్ష్యం
- రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్ సహా పలు రంగాలపై దృష్టి
- సీఎంతో పాటు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి కూడా పయనం
- ఇప్పటికే సింగపూర్, దావోస్‌లో పర్యటించిన చంద్రబాబు



**అమరావతి అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏపీకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు మరోసారి విదేశీ పర్యటనకు రెడీ అయ్యారు. విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించేందుకు ఆయన మంగళవారం నుంచి దుబాయ్, అబుదాబి, యూఏఈలలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితులను వివరించి, పారిశ్రామికవేత్తలను ఏపీకి తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ప్రధానంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, రవాణా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్నోవేషన్ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించనున్నారు. ఈ మేరకు పలువురు ప్రముఖ పెట్టుబడిదారులతో ఆయన సమావేశం కానున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే ఈ పర్యటనలు చేపడుతున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రితో పాటు ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, అలాగే పలు కీలక శాఖలకు చెందిన ఉన్నతాధికారుల బృందం కూడా పాల్గొంటోంది. కాగా, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఇప్పటికే సింగపూర్, దావోస్ వంటి ప్రాంతాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను కలిశారు. మరోవైపు మంత్రి నారా లోకేశ్ కూడా ఆస్ట్రేలియాలో పర్యటిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.


# ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ...

## ఏపీ ఆక్వా రైతులకు భారీ ఊరట

- భారత రొయ్యల దిగుమతికి ఆమోదం తెలిపిన ఆస్ట్రేలియా
- ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఉన్న అడ్డంకులు ఇక దూరం
- అమెరికా సుంకాలతో నష్టపోయిన ఆక్వా రంగానికి గొప్ప ఊరట
- కొత్త మార్కెట్ల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలం
- సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియాతో భాగస్వామ్యంపై లోకేశ్ చర్చలు ఫలప్రదం



అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు భారీ ఊరట లభించింది. భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. చాలాకాలంగా వైట్ స్పాట్ వైరస్ కారణంగా మన రొయ్యలపై ఉన్న అడ్డంకులు ఈ నిర్ణయంతో తొలగిపోయాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పరిణామంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "భారత రొయ్యల దిగుమతికి తొలిసారిగా ఆమోదం లభించింది. ఇందుకు విశేషంగా కృషి చేసిన భారత, ఆస్ట్రేలియా ప్రభుత్వాలకు మా ప్రగాఢ కృతజ్ఞతలు" అని ఆయన తెలిపారు. కేవలం ఒకే మార్కెట్‌పై ఆధారపడకుండా, నూతన మార్కెట్లను అన్వేషించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన పర్యటనలో




భాగంగా, సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంపై ఆస్ట్రేలియాతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు లోకేశ్ చర్చలు జరుపుతున్నారు. సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (%ూ×ూ%) సీఈఓ వెరోనికా పాపకోస్టా, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్వేర్‌లతో ఆయన సమావేశమయ్యారు. సుస్థిర ఆక్వాకల్చర్, వాణిజ్య అవకాశాలపై వారితో చర్చించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఈ ఎగుమతుల విలువ 7.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,000 కోట్లు)" అని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'గ్రేట్ ఆస్ట్రేలియన్ సీఫుడ్' పేరుతో సొంత బ్రాండ్‌ను సృష్టించి, తమ ఉత్పత్తులను ప్రీమియం మార్కెట్‌కు తీసుకెళ్లిన ఆస్ట్రేలియా విధానం తనను ఆకట్టుకుందని లోకేశ్ అన్నారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని, ఏపీ సీఫుడ్ పరిశ్రమకు అవసరమైన మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, అమెరికా సుంకాల వల్ల ఏపీలోని ఆక్వా రంగం సుమారు రూ. 25,000 కోట్ల నష్టాలను చవిచూసిందని, 50 శాతం ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెలలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆయన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌లకు లేఖలు రాశారు. అమెరికాపై ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా తీసుకున్న తాజా నిర్ణయం ఆక్వా రంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

## ముగిసిన జూబ్లీహిల్స్

# ఉప ఎన్నిక నామినేషన్ గడువు..

## 150కి పైగా నామినేషన్లు



**నేడు మధ్యాహ్నం 3 గంటల వరకు ముగిసిన నామినేషన్ గడువు**
**గేటు లోపల ఉన్న వారికి నామినేషన్ వేయడానికి అవకాశం**
**బరిలో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు నామినేషన్ల గడువు నేటితో ముగిసింది. ఈ నియోజకవర్గం నుంచి మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ దాఖలు చేయడానికి ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉండగా, ఆ సమయానికి గేటు లోపల ఉన్నవారికి నామినేషన్ దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు, ఓయూ, నిరుద్యోగ సంఘాల నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. రేపటి నుంచి నామినేషన్లను పరిశీలించనున్నారు. అక్టోబర్ 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, 14న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# సీపీఐ ఏపీ కార్యదర్శిగా ఈశ్వరయ్య




ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన జి.ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటించారు. సీపీఐ ఏపీ నూతన కౌన్సిల్ 102 మందితో ఎన్నికవ్వగా.. 33మందిని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కాగా ఆగస్టులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యదర్శి ఎన్నిక జరగాల్సి ఉండగా వాయిదా వేశారు. జాతీయ మహాసభలు ముగిసిన తర్వాత రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకుంటామని సీపీఐ అగ్రనాయకత్వం అప్పుడు ప్రకటించింది. ప్రస్తుతం జాతీయ మహాసభలు ముగియడంతో రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకున్నారు.

## డయాబెటిస్ పుండ్లకు చెక్.. గాయాలను వేగంగా

# మాన్పే సహజ సిద్ధ ఔషధం

- డయాబెటిస్ పుండ్లకు సహజ సిద్ధమైన ఔషధం గుర్తింపు
- నాగాలాండ్ యూనివర్సిటీ పరిశోధకుల కీలక ఆవిష్కరణ
- మొక్కల్లో లభించే 'సినాపిక్ యాసిడ్'తో అద్భుత ఫలితాలు
- నోటి ద్వారా తీసుకుంటే వేగంగా గాయాలు నయం
- అవయవాల తొలగింపు ముప్పు తగ్గుతుందని వెల్లడి
- త్వరలోనే క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు



మధుమేహం (డయాబెటిస్) రోగులను తీవ్రంగా వేధించే సమస్య త్వరగా మానని పుండ్లు. ముఖ్యంగా పాదాలకు అయ్యే ఈ గాయాలు (డయాబెటిక్ ఫుట్ అల్సర్) ఒక్కోసారి ఇన్ఫెక్షన్లకు దారితీసి, అవయవాలను తొలగించాల్సిన పరిస్థితిని కల్పిస్తాయి. ఈ తీవ్రమైన సమస్యకు పరిష్కారం చూపే దిశగా నాగాలాండ్ యూనివర్సిటీ పరిశోధకులు ఒక కీలక ముందడుగు వేశారు. పలు రకాల మొక్కల్లో సహజ సిద్ధంగా లభించే 'సినాపిక్ యాసిడ్' అనే సమ్మేళనం, డయాబెటిస్ పుండ్లను అత్యంత సమర్థవంతంగా నయం చేయగలదని తమ పరిశోధనలో గుర్తించారు. ఈ ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు ప్రతిష్ఠాత్మక 'నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సినాపిక్ యాసిడ్‌ను నోటి ద్వారా తీసుకున్నప్పుడు అది గాయాలు మానే ప్రక్రియను గణనీయంగా వేగవంతం చేసినట్లు ప్రీ-క్లినికల్ అధ్యయనాల్లో నిరూపితమైంది. మనం తినే అనేక మొక్కల్లో ఉండే ఈ యాసిడ్, శరీరంలోని కణజాల మరమ్మతు, రక్తనాళాల ఏర్పాటు, వాపు నియంత్రణలో కీలకపాత్ర పోషించే 'SIRT1' అనే మార్గాన్ని ఉత్తేజితం చేయడం ద్వారా పనిచేస్తుందని పరిశోధకులు తేల్చారు. ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ ప్రణవ్ కుమార్ ప్రభాకర్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మధుమేహంతో బాధపడుతున్నారు. వారిలో గాయాలు ఆలస్యంగా మానడం ఒక పెద్ద సమస్య. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మందుల వల్ల దుష్ప్రభావాలు ఎక్కువగా ఉండటంతో పాటు వాటి సమర్థత కూడా పరిమితంగానే ఉంది. మా పరిశోధన ఈ లోటును భర్తీ చేసే సహజసిద్ధమైన, సురక్షితమైన చికిత్సకు మార్గం చూపుతుంది" అని వివరించారు. ఆసక్తికరంగా ఈ ఔషధాన్ని ఎక్కువ మోతాదు (40 mg/kg) కంటే తక్కువ మోతాదు (20 mg/kg) ఇచ్చినప్పుడే మెరుగైన ఫలితాలు కనిపించాయని పరిశోధకులు తెలిపారు. ఇది భవిష్యత్తులో మందుల తయారీకి, సరైన మోతాదును నిర్ధారించడానికి ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సహజసిద్ధమైన చికిత్స అందుబాటులోకి వస్తే, తక్కువ ఖర్చుతోనే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని రోగులకు కూడా మెరుగైన వైద్యం అందించవచ్చని, అవయవాలు కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తదుపరి దశలో భాగంగా క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

## ప్రపంచంలోనే అత్యంత

# బరువైన గోల్డ్ డ్రెస్..

**ప్రపంచంలోనే అత్యంత బరువైన బంగారు వస్త్రం ఆవిష్కరణ**
**ఏకంగా 10.5 కిలోల బరువుతో తయారీ**
**దీని విలువ సుమారు రూ. 9.5 కోట్లు**
**గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న వస్త్రం**
**సౌదీకి చెందిన అల్ రొమైజాన్ సంస్థ రూపకల్పన**
**వజ్రాలు, కెంపులు, పచ్చలతో ప్రత్యేక అలంకరణ**




విలాసానికి, అద్భుతమైన నిర్మాణాలకు పెట్టింది పేరైన దుబాయ్, ఫ్యాషన్ ప్రపంచంలో మరో సరికొత్త సంచలనం సృష్టించింది. ప్రపంచంలోనే అత్యంత బరువైన బంగారు వస్త్రాన్ని రూపొందించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఏకంగా 10.5 కిలోల బరువున్న ఈ డ్రెస్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. దీని విలువ సుమారు 10.88 లక్షల డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 9.5 కోట్లు. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ ఆభరణాల సంస్థ 'అల్ రొమైజాన్ గోల్డ్' ఈ అద్భుతమైన వస్త్రాన్ని తయారు చేసింది. పూర్తిగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ డ్రెస్‌లో అత్యంత విలువైన వజ్రాలు, కెంపులు, పచ్చలు, రత్నాలను పొదిగారు. మధ్యప్రాచ్య కళా నైపుణ్యం ఉట్టిపడేలా సంపద, అందం, సాధికారతకు ప్రతీకలుగా నిలిచే డిజైన్లతో దీనిని అలంకరించారు. ఈ డ్రెస్ కేవలం ఒక వస్త్రంలా కాకుండా, ధరించగలిగే కళాఖండంలా కనిపిస్తుంది. ఈ బంగారు వస్త్రం నాలుగు ప్రధాన భాగాలుగా ఉంది. ఇందులో 398 గ్రాముల బరువున్న బంగారు కిరీటం (టియారా), ఏకంగా 8,810.60 గ్రాముల బరువున్న నెక్లెస్, 134.1 గ్రాముల చెవిపోగులు, 738.5 గ్రాముల బరువున్న 'హియార్' అనే నడుము ఆభరణం ఉన్నాయి. ఇటీవల షార్జాలో జరిగిన 56వ మిడిల్ ఈస్ట్ వాచ్ అండ్ జ్యువెలరీ షోలో దీనిని ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనలోనే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు దీనిని అధికారికంగా గుర్తించారు. ఫ్యాషన్, ఆభరణాల తయారీ రంగాలను ఏకం చేసి, ధరించగలిగే కళను ప్రపంచానికి పరిచయం చేయాలన్న లక్ష్యంతోనే ఈ డ్రెస్‌ను రూపొందించినట్లు తయారీదారులు వెల్లడించారు. అయితే, ఈ అపురూప వస్త్రాన్ని అమ్మకానికి ఉంచడం లేదని వారు స్పష్టం చేశారు. భవిష్యత్తులో యూరప్, ఆసియాలోని పలు ముఖ్య నగరాల్లో జరిగే ఫ్యాషన్, జ్యువెలరీ ప్రదర్శనల్లో దీనిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**చింతలపూడి, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేకరి):**

నియోజకవర్గ పరిధిలోని నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. లింగపాలెం, చింతలపూడి మండలాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా నేరుగా స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మాకు ఈ చెక్కులను అందించడం చాలా సంతోషాన్నిచ్చిందని కూటమి ప్రభుత్వానికి, శాసన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వెలివేంటి పురుషోత్తమ ప్రసాద్ 43,688 రూపాయలు, సుగంధం సూరమ్మ 50,000 రూపాయలు, యలమంచి ప్రసాద్ 23500 రూపాయలు, మద్దిపాటి పద్మావతి 90,000 రూపాయలు .2,07,188 లక్షల రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.

## ఏజెన్సీ గిరిజన సమస్యలు పరిష్కరించాలి..!
## నేడు ఐటీడీఏ ముట్టడి



**తెలుగు రాష్ట్రం : ఏలూరు జిల్లా /కుక్కునూరు:**

పోడు భూముల పట్టాలు,ఏజెన్సీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నేడు జరిగే కేఆర్ పురం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ. కృష్ణచైతన్య పిలుపునిచ్చారు.మంగళవారం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పోలవరం ప్రాజెక్టు ముంపుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజన గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం గాలికివదిలేసింది ఆరోపించారు.పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న ప్రభుత్వాల హామీలు నెరవేరకపోవడంపై ఆయన ధ్వజమెత్తారు.కాగా ఐటీడీఏ ముట్టడికి విలీన మండలాల నుంచి గిరిజనులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొన్నె.లక్ష్మయ్య, ఐతా. సురేష్ బాబు, మైసాక్షి. వెంకటాచారి,మడిపల్లి. రమణయ్య ,కురాకుల. బాబూరావు, వరసా. పాపారావు, సోడే. నగేష్, వరకా.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## లోతుగడ్డ-రాళ్లగడ్డ రోడ్డుపై
# ప్రజా ఆగ్రహం!

**శిథిలమైన రహదారిపై కాంగ్రెస్ ఆందోళన**
**వెంటనే పునర్నిర్మాణం చేయాలని డిమాండ్!**
**రోడ్డు గోతులు...వాహనదారులకు ప్రమాదం...**
**వర్షాల తర్వాత పరిస్థితి మరింత దారుణం..!**



**చింతపల్లి, అక్టోబర్ 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని లోతుగడ్డ వంతెన నుంచి బలపం పంచాయతీ రాళ్లగడ్డ వరకు రహదారి శిధిలావస్థలో మారింది. వర్షాలతో గుంతలు ఏర్పడి, మట్టి, నీటితో నిండిపోవడంతో వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో అల్లూరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పాంగి రామకృష్ణ నేతృత్వం వహించారు. ఆయనతో పాటు మహిళలు, యువత, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు రోడ్డు సరిచేయండి%-%ప్రజలకు న్యాయం చేయండి! అంటూ నినాదాలతో ఆందోళనకు ఊపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతుగడ్డ%-%రాళ్లగడ్డ రహదారి ప్రతిరోజూ ఆంధ్ర%-%ఒడిశా సరిహద్దు ప్రాంత ప్రజల ప్రయాణానికి ప్రధాన మార్గం. రహదారి గోతులు, మట్టి మయమై ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. మేము నిశ్శబ్దంగా ఉండం. తక్షణమే రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపడతాం అని హెచ్చరించారు. లోతుగడ్డ%-%బలపం రహదారి పునర్నిర్మించబడితే కేవలం ఈ ప్రాంతానికి మాత్రమే కాదు, కుడుముసారి, తమ్మింగుల పంచాయతీలు, ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఈ మార్గం రైతులకు, విద్యార్థులకు ప్రాణాధారమైంది. ప్రభుత్వం నిధులు కేటాయించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు మాట్లాడుతూ ప్రతీ రోజు ప్రమాద భయం వాహనాలు పాడైపోతున్నాయి. పిల్లలు పాఠశాలకు వెళ్లడం కష్టమవుతోంది. మాటలు కాదు, పనులు కావాలి! అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు రాకపోకలు కూడా స్తంభించి ప్రజలు కష్టాల్లో ఉన్నారని తెలిపారు. నిరసన కార్యక్రమంలో పాంగి కంబు, పాంగి నాగేశ్వరరావు, తాంబేలి శ్రీను, గెమ్మెలి సత్తిబాబు, పాంగి వినోద్, పాంగి చిట్టిబాబు, తాగి సన్యాసిరావు, శేఖర్‌తో పాటు మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామస్తులు రహదారి మరమ్మత్తులు పూర్తి అయ్యే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్ ఆక్రమణలకు వ్యతిరేకంగా
# రౌండ్ టేబుల్ సమావేశం



**ముమ్మిడివరం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్ ఆక్రమణలు తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బస్టాండ్ ను ఆక్రమించిన లీజుదారుడుపై క్రిమినల్ చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని వామపక్షాలు,దళిత,విద్యార్థి,మహిళ, ప్రజా హక్కుల సంఘాల ఆధ్వర్యంలో నేడు ముమ్మిడివరం నిరాహార దీక్ష శిబిరంలోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ రౌండ్ టేబుల్ సమావేసానికి సిపిఎం మండల కార్యదర్శి సకిలే సూర్యనారాయణ అధ్యక్షత వహించడం జరిగింది తక్షణమే బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు, విద్యార్థి, యువజన, మహిళ, దళిత, సామాజిక, హక్కుల, ప్రజాసంఘాలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి .ఈసందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు నిరాహార దీక్ష చేస్తున్న చీకురిమెల్లి రవికుమార్ తదితర నాయకులు మాట్లాడుతూ ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్‌ను అక్రమణల నుండి తొలగించి, ప్రజలందరికీ తక్షణమే బస్సు రాకపోకల కోసం అందుబాటులోకి తీసుకురావాలన్నారు ఆర్టీసీకి చెందిన మొత్తం 2.70 ఎకరాల స్థలానికి సంబంధించిన లీజును వెంటనే రద్దు చేయాలని ప్రజల వినియోగం కోసం బస్టాండ్‌లో తగిన నిర్మాణాలు చేపట్టి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు ?బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన కళ్యాణ మండపాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, దానిని ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. అక్రమంగా బస్టాండ్ ప్రాంతాన్ని ఆక్రమించిన లీజుదారుడుపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి, చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ప్రయాణికులకు వీలుగా మంచినీళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి, సౌకర్యార్థం కుర్చీలు, ఫ్యాన్లు వంటి కనీస వసతులను ఏర్పాటు చేయాలన్నారు ఆర్టీసీ కౌంటర్‌ను తిరిగి ప్రారంభించి, అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని చేశారు. ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడం వల్ల ఈ ప్రాంతంలో అనేక కళాశాల విద్యార్థులు మహిళలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలందరి సౌకర్యార్థం మరియు ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న పోరాటంలో ప్రజలందరూ కలిసి రావాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు ఈ బస్టాండ్ పరిరక్షణ కోసం ముమ్మిడివరం బస్టాండ్ పరిరక్షణ పోరాట కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీ కి అధ్యక్షులుగా చీకరుమల్లి రవికుమార్ కన్వీనర్ గా జి దుర్గప్రసాద్ కార్యదర్శిగా బూసి శరత్ బాబు మరో ఆరుగురు కన్వీనర్లుగా మొత్తం 20 మంది కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది బస్టాండ్ ఆక్రమణలు తొలగించాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రేపు స్థానిక శాసనసభ్యులు,ఎంపీ, మరియు జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందిస్తామని అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష కార్యచరణ చేసి ప్రజలు అందుబాటులోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా వక్తలు ప్రభుత్వానికి హెచ్చరిక చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గుత్తాల రమణ కర్నీడి వెంకటరమణ పందిరి శ్రీనివాసరావు శెట్టిబత్తుల బత్తుల తులసిరావు కప్పల సత్యనారాయణ ఎలమంచిలి బాలరాజు బడుగు భీమేశ్వరం నిమ్మకాయల వెంకటేష్ కామిడి శ్రీనివాస్, గుర్రాల రాంబాబు గుత్తాల వరప్రసాద్ జనపల్లి దుర్గాప్రసాద్ పందు అప్పలస్వామి నల్లా రాంజీ అరుణ్ కుమార్ మెండి డి కృష్ణ బాబు పోతుల వేమ సుందర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు



## పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి..

**అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్‌లకు నివాళులర్పించిన ఎస్సై జి. నరేష్**


**ఆలమూరు అక్టోబర్ 21( తెలుగు రాష్ట్రం)**




ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఆలమూరు ఎస్సై జి. నరేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ ఎ “1959 అక్టోబర్ 21న జమ్మూ కాశ్మీర్‌లోని లడాక్ ప్రాంతంలో చైనా దురాక్రమణకు ఎదురు నిలిచి ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం ఈ రోజు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నాం” అని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించిన పోలీసు అధికారుల త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన పేర్కొన్నారు. వారు ధైర్యం, సేవాభావం, నిబద్ధతలకు ప్రతీకలని ఎస్సై నరేష్ అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసిన సీఎం చంద్రబాబు

**నియోజకవర్గ అభివృద్ధి నిధులు, అనుమతుల మంజూరుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి**



**అమరావతి అక్టోబర్ 21 ( తెలుగు రాష్ట్రం)**

లొల్ల లాకుల పునర్నిర్మాణం, వాడపల్లి రోడ్డు నిర్మాణం, డివిజనల్ కార్యాలయాల స్థాపనకు వినతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం అమరావతిలోని సీఎం పేషీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమగ్రాభివృద్ధి నిమిత్తం చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించి, అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఎ “సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టు, కోనసీమకు భాగ్యప్రదాయినిగా నిలిచిన లొల్ల లాకుల పునర్నిర్మాణం తక్షణం చేపట్టాలి” అని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. అదేవిధంగా కొత్తపేటలో ఆర్డీవో, డీఎల్డీవో, కోర్టు, ఇతర విభాగాల కార్యాలయాలు కలిగిన డివిజనల్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్కెట్ యార్డ్ కమిటీ స్థలాన్ని కేటాయించాలని కోరారు. కొత్తపేట తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, రావులపాలెం జాతీయ రహదారి నుండి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణం చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. ంకొత్తపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందనే నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు.

## తిరుమల తరువాత
## తిరుమలలా వాడపల్లి వైభవం...

**వాడపల్లి అభివృద్ధికి చేయూతనందించండి ఎ దేవాదాయశాఖ మంత్రికి ఎమ్మెల్యే బండారు విజ్ఞప్తి**
**పలు అభివృద్ధి పనులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం అక్టోబర్ 21( తెలుగు రాష్ట్రం)**




కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. మంగళవారం తాడేపల్లిలోని మంత్రివారి క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ “తిరుమల తరువాత తిరుమలలా వాడపల్లి అభివృద్ధి చెందుతోంది. ఏడు శనివారాల వెంకన్న దర్శనంతో ఆలయం వైకుంఠాన్నితలపిస్తోంది. ఇటీవల ముగిసిన 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు” అని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వెల్లువలా తరలివస్తుండటంతో, భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు మరిన్ని పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం దేవాదాయశాఖ నుండి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని మంత్రి ఆనంకు విజ్ఞప్తి చేశారు. ఆలయ విశిష్టతను పురస్కరించుకుని స్వామివారి దర్శనం చేసుకుని కృపకు పాత్రులవ్వాలని మంత్రిని ఆహ్వానించారు. అనంతరం స్వామివారి ప్రసాదం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, మైగపుల గురవయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లో చింతపల్లి...! పంచాయతీ వెలుగులు ఎక్కడ..?

- **అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**
- **వెంటనే వీధిలైట్లు మరమ్మతు చేయాలి**
- **చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు.**

**చింతపల్లి, అక్టోబర్ 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రం చీకట్లో మునిగిపోతోంది. పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గ్రామ వీధులు వెలుతురు లేక ప్రమాదకరంగా మారాయి. పాత బల్బులు వెలగక, విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా వేలాడుతుండటంతో రాత్రివేళల్లో ప్రజలు బయటికి రావడానికే భయపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు విస్మరించడంతో పాటు సచివాలయం%-%1 సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావడం లేదు. ప్రజల ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. దీనివల్ల గ్రామం చీకట్లో మునిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని మండిపడ్డారు. ఆయనతో పాటు టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం చింతపల్లి ప్రధాన వీధులను పరిశీలించి పరిస్థితిని ప్రత్యక్షంగా గమనించారు. వీధి దీపాలు మృతప్రాయంగా మారి నెలలుగా వెలగకపోవడమే కాకుండా, విద్యుత్ తీగలు సడలిపడి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయని వారు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిపై తక్షణ చర్యలు తీసుకుని, అన్ని వీధిలైట్లను వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణం. సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం గమనించాలని ఆనందరావు డిమాండ్ చేశారు. గ్రామస్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వర్షాకాలం మొదలై రోడ్లపై నీరు నిలుస్తోంది. చీకట్లో నడవడమే కష్టం. విద్యుత్ అధికారులు, పంచాయతీ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు అంటూ మండిపడ్డారు.



# చింతపల్లిలో ఘనంగా జాతీయ ఆదివాసీ క్రైస్తవ ఐక్యవేదిక సమ్మేళనం!



**చింతపల్లి, అక్టోబర్ 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పట్టణంలోని ఆదివాసీ ప్రభావిత ప్రాంత శిక్షణ కేంద్రంలో మంగళవారం జాతీయ ఆదివాసీ క్రైస్తవ సేవకుల ఐక్యవేదిక సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని సంఘ కాపరులు వి. సోమరాజు, పి. డేవిడ్, కాలేబు తిమోతి పాస్టర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమ్మేళనంలో మాట్లాడిన వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే క్రైస్తవులు ఒకే వేదికపైకి వచ్చి పరస్పర సహకారంతో ముందుకు సాగడం అత్యవసరం అని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో సేవకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి ఐక్యతే మార్గమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు కే. నిరీక్షణరావు, జాతీయ సెక్రటరీ ఎం. ఎలిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ ఎం. కృపానిధి, తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ దైవప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో క్రైస్తవ సేవకులు అనేక అణచివేతలు, ఒత్తిడులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో మనం ఐక్యంగా ఉండి సంఘంలో ప్రేమ, శాంతి, సహనంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల నుండి వచ్చిన సేవకులు మరియు విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా పలు మండలాల సేవకులను మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో క్రైస్తవ సంఘ కమిటీలకు సభ్యులుగా నియమించినట్టు నిర్వాహకులు ప్రకటించారు. నూతనంగా నియమితులైన సభ్యులు తమ సేవా కార్యక్రమాల ద్వారా క్రైస్తవ సంఘ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక క్రైస్తవ ప్రజలు దేశంలో శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఈ సమావేశం ద్వారా ఆదివాసీ క్రైస్తవుల మధ్య ఐక్యత, అవగాహన, సేవా ఉత్సాహం మరింత పెరుగుతుంది. ఈ ఉద్యమం రాష్ట్రాన్ని దాటి జాతీయ స్థాయికి చేరాలని మేము ఆకాంక్షిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండలానికి చెందిన జోసెఫ్, సామ్యూల్, చింతపల్లి మండలానికి చెందిన టి. రవి వినోద్, భూషణం, జాన్ పాల్, యేసురాజు, తిమోతి, జోసెఫ్, గాబ్రియేల్ తదితర బోధకులు పాల్గొన్నారు.ం

# సర్వేయర్ గా మారిన స్థానిక నాయకుడు

## గుట్టు చప్పుడు లేకుండా సర్వే -సర్వేను అడ్డుకున్న స్థానిక గ్రామ ప్రజలు

**అల్లూరి జిల్లా, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గంలో నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ, బంజారా, పేద ప్రజలు సాగు చేస్తున్న భూములను అడ్డగోలుగా కార్పొరేటర్ సంస్థ యజమానులకు కట్టబెడుతున్నారు. రైతులకు తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా భూ సర్వే చేయించే ప్రయత్నం చేస్తున్నారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గరుగుబిల్లి పంచాయతీ సింగవరం రెవెన్యూలో ఈ ఘటన జరిగింది. స్థానిక నాయకులు భూ యజమానుల వైపు కొమ్ము కాస్తూ ఎన్నో ఏళ్ల నుండి ఆ భూమి వివాదంలో ఉన్నప్పటికీ రైతుల అనుమతి లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సర్వే చేయించే ప్రయత్నం చేస్తుంటే సింగవరం గ్రామ ప్రజలు, యువత సర్వే చేయకుండా అడ్డుకకోవడంతో వైఎస్ఆర్సిపి స్థానిక నాయకుడు వాగ్వాదానికి దిగి తానే సొంతంగా సర్వే



చేయడానికి సర్వే మీటర్ తీసుకుని సర్వే చేయడం జరిగింది. స్థానిక ప్రజలు అడిగితే దీనికి మీకు ఎటువంటి సంబంధం లేదని వారితో వాగ్వాదానికి దిగారు. ఈ భూమిలోకి ఎవరు వచ్చిన ఊరుకొనేదే లేదని హెచ్చరించారు. ప్రవేట్ సర్వేయర్లతో సర్వే చేస్తే వప్పుకొనేది లేదని సర్వే చేయకుండా ఆపడం జరిగింది. ప్రభుత్వ భూమి ప్రజలకు ఇప్పించకుండా భూస్వాములకు అప్పగించడం సరైన పద్ధతి కాదని స్థానిక నాయకుడితో మాట్లాడం జరిగింది. కొండలు కూడా ఉంచకుండా డబ్బుల కోసం అమ్మేస్తే మా జీవనం సాగించడం ఎలా అంటూ స్థానిక గ్రామ ప్రజలు, నాయకుడు మధ్య వాదపు వాదనలు జరిగాయి. సర్వే అడ్డుకున్న గ్రామ యువతపై స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లెట్ ఇచ్చారు. కంప్లెట్ ఇచ్చిన సరే భూమి వదులుకోనేది లేదని గ్రామ ప్రజలు తెలిపారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు కేటాయించిన భూమి ఎంత?

**అనంతగిరి, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేఖరి):** హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీలో గుజ్జిలి పేరు మీద వస్తుందని ప్రజలకు తెలిసి భయభ్రాంతులకు గురియ్యారు. చిప్పపల్లి రెవిన్యూలో మొత్తం భూమి ఎంత ఉంది? పవర్ ప్రాజెక్ట్ కు ఎంత కేటాయించారు? ఏ ప్రదేశంలో నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది? నాన్ షెడ్యూల్ ప్రాంతం వలన ప్రవేట్ వ్యక్తులు భూములు కొనుకొని ఉన్నారు. రైతుల భూములు ఎన్ని ఎకరాలు భూమి, ప్రభుత్వ భూమి ఎన్ని ఎకరాలు పవర్ ప్రాజెక్ట్ కు కేటాయించారనే విషయం స్పష్టంగా ప్రజలకు తెలియచేయండి. ప్రజల అభిప్రాయాలు మీకు తెలియచేస్తారు. పవర్ ప్రాజెక్ట్ వస్తుందని నాన్ షెడ్యూల్ గిరిజన ప్రజలకు అధికారులు, నాయకులు గ్రామ సభలు ఏర్పాటు చేసి ఇంత వరకు తెలియచేయలేదు. అధికారికంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం తెలియచేయడం లేదు. గుజ్జిలి గ్రామంలో ఎంత మంది రైతుల భూములు, ప్రభుత్వ భూమి ఎంత, చిప్పపల్లి గ్రామంలో ఎంత మంది రైతుల భూములు, ప్రభుత్వ భూమి ఎంత పవర్ ప్రాజెక్ట్ కు కేటాయించి ఉన్నారు. ప్రవేట్ వ్యక్తులు వందలు ఎకరాలు కొనుకొని ఉన్నారు. ప్రవేట్ వ్యక్తుల భూములు ఎన్ని ఎకరాలు పవర్ ప్రాజెక్ట్ కు కేటాయించారు. ఇన్ని నెలలు గా రైతులు ధర్నాలు, రాస్తారోకోలు ఆందోళన చేపట్టిన ప్రవేట్ భూ యాజమాన్యం మాత్రం నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఎటువంటి హడావుడి లేకుండా ఉన్నారు. సచివాలయంలో పవర్ ప్రాజెక్ట్ వద్దని సమావేశాలు ఏర్పాటు చేస్తే ప్రవేట్ భూ యాజమాన్యం మాత్రం రాలేదు. తెరవెనుక ప్రవేట్ భూ యజమానులు పవర్ ప్రాజెక్ట్ రావాలని ప్రయత్నం చేస్తున్నారేమోనని ప్రజలల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు మేప్ విడుదల చేయండి. అ మేప్ సచివాలయంలో డిజిటల్ లో చూపిస్తే ప్రజలకు అవగాహన వస్తుంది. అంతే కాని పవర్ ప్రాజెక్ట్ వస్తుందని నాన్ షెడ్యూల్ ప్రాంతంలో భయపడి ఇల్లు నిర్మాణం చేపట్టడం లేదు. ఊర్లు కాలి చేయాలని భయంతో ఉన్నారు. రెవిన్యూ అధికారులకు అంత తెలుసు కాని నోరు మెదపడం లేదు. చిప్పపల్లి రెవిన్యూలో కొనుగోలు చేసిన ప్రవేట్ భూ యజమానుల భూముల్లో బంజారా, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, వందల ఎకరాలు ఉన్నాయి వాటి పరిస్థితి ఏంటి?



## మస్కట్ లో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మహిళ

### ఎమ్మెల్యే బొలిశెట్టి ఆర్థిక సహాయంతో క్షేమంగా ఇంటికి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేకరి):** జీవనోపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని సీతారాంపేటకు చెందిన మన్నే ఆదిలక్ష్మి పొట్ట కూటి కోసం మస్కట్ వెళ్ళింది. అక్కడ కూలి పని చేస్తూ వచ్చిన సొమ్ములను ఇంటికి పంపించేది. అయితే ఇటీవల ఆమె అనారోగ్యానికి గురి కావడంతో ఇబ్బందులు మొదటికొచ్చాయి. ఈ అనారోగ్య విషయాన్ని ఆమె తాడేపల్లిగూడెంలో ఉంటున్న తల్లికి ఫోన్ ద్వారా తెలియజేసింది. కూతురు విదేశాల్లో పడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక, ఆపదలో ఉన్న వారికి కొండంత అండగా నిలుస్తున్న శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దగ్గర మొర పెట్టుకుంది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మస్కట్ కు ప్రత్యేకంగా ఓ బృందాన్ని పంపించి ఆదిలక్ష్మి విమానం చార్జీలనిచ్చి ఇండియాకు తీసుకొచ్చి ఆమె కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. కుటుంబ సభ్యులను కలుసుకున్న ఆదిలక్ష్మి మాట్లాడుతూ మస్కట్ నుంచి భారత్ కు తీసుకొచ్చేందుకు ఆర్థిక సహకారం అందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ కి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ కుటుంబ పోషణ నిమిత్తం దేశం గాని దేశం వెళుతున్న మహిళలు జాగ్రత్తగా ఉండాలని వివరించారు.

# నోటీసు గడువు ముగిసిన చర్యలేవి?

### -ఐటీడీఏ పీవోకి కొక్కెరపాటి రవీంద్ర వినతి



**కూనవరం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేఖరి):** కూనవరం పంచాయతీలో జరిగిన అవినీతిపై అధికారులు చేసిన దర్యాప్తు మేరకు అవినీతి జరిగిందని వాటికి సమాధానం చెప్పాలని కూనవరం మాజీ ఈవో సురేష్ కి, కూనవరం ప్రమోషన్ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ కి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వడం జరిగింది. నోటీసులు గడువు ముగిసిన నేటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని, అవినీతిని త్వరగా బయటపెట్టి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని అవినీతికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఐటీడీఏ పీఓకి అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొక్కెరపాటి రవీంద్ర వినతి పత్రం అందజేశారు.

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎన్ఎస్ఆర్ కాలనీ వాసులు



**నాయుడుపేట, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీ వద్ద రైల్వే గేటు మరమ్మత్తుల పనులతో రైల్వే అధికారులు స్థానిక దళిత ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దయాకర్ రెడ్డికి వివరించారు. తమ ప్రాంతంలో రైల్వే గేటు మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలియజేశారు. తమ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. సానుకూలంగా సన్నారెడ్డి దయాకర్ రెడ్డి స్పందించి వెంటనే ఆర్డీవోకు, జిల్లా కలెక్టర్ కి ఫోన్ చేసి ఈ సమస్యని త్వరగా పరిష్కరించాలని తెలియజేశారు. అదే విధంగా త్వరలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేస్తానని, రైల్వే గేట్లను సందర్శిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, జడ వెంకటేష్ , కప్పల మునుస్వామి, దారా శేఖర్, మెండం తులసి, నారాయణ (చంటి), అశోక్, చెంచు ప్రసాద్, యువరాజు, పాల్గొన్నారు.

## పోలవరం ప్యాకేజీ నిధులు లబ్ధిదారుని ఖాతాలో సజావుగా జమ

### ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ సుధాకర్




**వి.ఆర్.పురం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ పరిహార డిపాజిట్ల విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన పడవలసిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వి.ఆర్.పురం బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ తెలిపారు. పోలవరం ప్యాకేజీ నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సజావుగా జమవుతున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం కొత్తగా మారిన బ్యాంకు ఖాతా నంబర్లు, పాత నంబర్లు రెండూ సమాంతరంగా పని చేస్తున్నాయని వివరించారు. ఈ వివరాలన్నీ జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే సమర్పించామని వెల్లడించారు. ఖాతా నంబర్ మారినా లావాదేవీలకు ఎటువంటి ఆటంకం ఉండదని హామీ ఇచ్చారు. అయితే ఐఎఫ్ఎస్సీ కోడ్ మాత్రం పూర్తిగా మారినందున, లబ్ధిదారులు ఏదైనా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ చేసే ముందు కొత్త కోడ్ ఉపయోగించాలని రూరల్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్ సూచించారు. అంతేకాదు వాట్సాప్ గ్రూపులో దుష్ప్రభావిత ప్రచారాలు జరుగుతున్నాయని, అటువంటి వ్యాఖ్యలను ఖాతాదారులు పట్టించుకోరాదని, ఖాతాదారులు మునుపు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఏ అకౌంట్ అయితే ఇచ్చారో అది సజావుగా పని చేస్తూ పోలవరం అమౌంటు అందులో జమ అవుతుందని తెలిపారు. ఖాతాదారులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని, బ్యాంకు వద్దకు వచ్చి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయనవసరం లేదని, మీ యొక్క పూర్తి వివరాలు, ప్రభుత్వ అధికారులకు, ప్రభుత్వమునకు పూర్తి సమాచారం మేమే అందిస్తామని తెలిపారు. మీరు ఇందులో ఎటువంటి చొరవ తీసుకోవాల్సిన అవసరం లేదని ఖాతాదారులకు మీడియా ద్వారా స్థానిక బ్యాంకు మేనేజర్ తెలియజేశారు.

## ఆదివాసీ యువకుడికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీజీ పట్టా




**వి.ఆర్.పురం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలోని మోద్దులగూడెం గ్రామానికి చెందిన కుంజా కిరణ్ కుమార్ పూణేలోని సింబయాసిస్ విశ్వవిద్యాలయం నుండి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా సాధించారు. 2023%–%25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ పీజీ చదువులో గ్రేడ్ 'ఎ'తో ప్రావీణ్యతను కనబరిచిన కిరణ్ కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ సంస్థలో మానవ వనరుల విభాగంలో పని చేస్తున్నారు. ఐటి రంగంలో మన వి.ఆర్.పురం ప్రాంతం నుండి ఉన్నత విద్యను పూర్తి చేసిన తొలి ఆదివాసిగా గుర్తింపు పొందిన ఆయన, గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారు. కిరణ్ కుమార్ విద్యా విజయాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, ఉద్యోగ వర్గాలతో పాటు శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు. "మన ఊరి యువత సమాచార సాంకేతిక రంగంలో ముందుకు సాగి దేశానికీ, మన సమాజానికీ గౌరవం తేవాలని కోరుకుంటున్నాం. కిరణ్ కుమార్ విజయంతో యువతలో కొత్త ఉత్సాహం కలిగింది" అని స్థానిక విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మండల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు అభినందనలు తెలియజేశారు.

# నిజమైన హీరులు పోలీసులే..

## అమలాపురంలో పోలీసు అమరవీరుల స్మృతి దినం





**అమలాపురం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోలీసులే నిజమైన హీరులు అని పోలీసు అమరవీరుల స్మృతి దినం కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథులు కొనియాడారు. మంగళవారం అమలాపురం పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల స్మృతి దినం – 2025 ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జిల్లా కలెక్టర్ శ్రీ మహేష్ కుమార్ ఆర్., ఐఏఎస్, ఎమ్మెల్యే శ్రీ అయితబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ శ్రీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ అతిథులకు స్వాగతం పలికారు.
పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.

**కవాతు మరియు స్మరణా కార్యక్రమం**

ఏఆర్ ఆర్ఐ శ్రీ బ్రహ్మానందం ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

రాష్ట్ర మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, "దేశానికి నిజమైన హీరోలు పోలీసులే. రేయింబవళ్లు ప్రజల రక్షణకై కృషి చేసే పోలీసుల త్యాగం స్మరణీయమైనది," అని అన్నారు. 1959లో లడక్‌లో జరిగిన సంఘటనలో అమరులైన 10 మంది సిఆర్పిఎఫ్ జవానుల త్యాగానికి గుర్తుగా అక్టోబర్ 21ను పోలీసు అమరవీరుల దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని వివరించారు. రాష్ట్ర పోలీసు శాఖ దేశంలోనే ఉత్తమంగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, దిశ యాప్ వంటి సౌకర్యాలతో ప్రజల సేవలో ముందంజలో ఉందని తెలిపారు.
అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ 'దేశానికి నిజమైన హీరోలు పోలీసులే." "పోలీసుల సంక్షేమం మా బాధ్యత." "సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసుల పాత్ర అమూల్యం." అని కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిదులు, అన్నారు.

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజా సేవలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలు అమూల్యం. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయం అందించబడుతుంది, అని తెలిపారు.
జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, "పోలీసులు ప్రజల భద్రత కోసం త్యాగం చేసే నిజమైన సైనికులు. వంద మార్కుల్లో 99 వచ్చినా పోలీస్ శాఖ ఆ ఒక మార్క్ కోసం కృషి చేస్తుంది," అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ ఏడాది మొత్తం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సంఖ్య 191. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం – 05 మంది. జిల్లా ఏఆర్ డీఎస్పీ శ్రీ సుబ్బరాజు గారు ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అమరులైన పోలీసుల పేర్లను చదివి శ్రద్ధాంజలి ఘటించారు.

**అమరుల కుటుంబాలకు సాయం**

ఎస్ఐ, శ్రీ అశోక్ కుమార్ మరియు కానిస్టేబుల్ శ్రీ బ్లెసన్ జీవన్ కుటుంబాలకు జ్ఞాపికలను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే శ్రీ అయితబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.







## ఆర్.సి.ఎం చర్చిలో ముగిసిన ఉపవాస కూడిక ప్రార్థనలు




**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేకరి):** తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలోని రోమన్ క్యాథలిక్ చర్చ్ (ఆర్.సి.ఎం)లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపవాస కూడిక ప్రార్థనలు ముగిశాయి. ప్రపంచ శాంతి, సమసమాజ స్థాపన కోసం, ప్రజలందరూ క్రీస్తు నడిచిన మార్గాన్ని అనుసరించాలని కడకట్ల విచారణ ఫాదర్ జోసఫ్ అర్జున్ సూచించారు. విచారణ సహాయక గురువు ఆధ్వర్యంలో చర్చి పాస్టర్ కె. పేతురు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ జోసఫ్ అర్జున మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం మానవాళికి గొప్ప సందేశమని తెలియ జేశారు. దైవంపై నమ్మకం, విశ్వాసాన్ని ఉంచితే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. ఉపవాస ప్రార్థనలు చేస్తున్నప్పుడు భక్తి కలిగి, విశ్వాసంతో, ఉపవాసం ఉండి, హృదయపూర్వకంగా ఏసు క్రీస్తుని ప్రార్థిస్తే తప్పకుండా భక్తుల కోరికలు నెరవేరతాయని అన్నారు. తెల్లవారుజామునే వాక్యాన్ని చదువుతూ, ధ్యానిస్తూ దేవుని సన్నిధిలో గడపాలని విశ్వాసులకు సూచించారు. ఉపవాస కుడిక ప్రాముఖ్యతను, క్రీస్తూ సందేశాన్ని తెలియజేశారు. సువార్తికులు క్రీస్తు గీతాలను ఆలపించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి గ్రామస్తులు భారీగా తరలివచ్చి ప్రేమ విందును ఆరగించారు. ఈ కార్యక్రమాన్ని సంఘ పెద్దలు, యూత్ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు.

## గొల్లగూడెంలో పూర్తయిన సిసి రోడ్ నిర్మాణం



**వి.ఆర్. పురం, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలో రేఖపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో వంద మీటర్ల సిసి రోడ్డు నిర్మాణం పూర్తయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ సభ్యులు మోడెం నరేష్ యాదవ్ అన్నారు. వాయిదాలో ఉన్న ఈ సీసీ రోడ్డుని పరిపూర్ణంగా పూర్తి కావటానికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, పెద్దలకు, ముఖ్యంగా మీడియా మిత్రులకు పేరుపేరునా గొల్లగూడెం గ్రామ పెద్దలు మోడెం నరేష్ గొల్లగూడెం గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## పోలీస్ అమరువీరుల దినోత్సవ ర్యాలీ



**చింతలపూడి, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం విలేకరి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ చింతలపూడిలో ర్యాలీ నిర్వహించారు. శాంతి భద్రతలను కాపాడుతూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు.

## నల్లా సూర్యచంద్రరావు 71వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**అమలాపురం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు, కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ మరియు కాపురత్న కీర్తిశేషులు నల్లా సూర్యచంద్రరావు గారి జయంతి నల్లా సూర్య చంద్రరావు గారి తనయులు నల్లా అజయ్ మరియు సంజయ్ ఆద్వర్యంలో గండువీధి ,మహిపాల వీధి, నల్లా గార్డెన్ లలో గల చంద్రరావు గారి విగ్రహలకు కుటుంబ సభ్యులు నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్ కూమార్ మరియు స్దానిక నాయకులతో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు తదుపరి అమలాపురం ఏరియా హాస్పిటల్ నందు పెషెంట్లకు మరియు హరి మనోవికాస కేంద్రం, లూయి అంధుల పాఠశాల నందు పాలు మరియు బ్రెడ్ అందించడం జరిగింది. తదుపరి నల్లా పవన్ మాట్లాడుతూ చంద్ర రావు గారు ప్రజలందరికీ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసి ఎన్నో విజయవంతమైన ఉద్యమాలు చేశారు అని ఇప్పటికీ ఆయన వారసులు గా కుటుంబ సభ్యులు అందరూ ఆయన అశయసాధన కోసం బడుగు బలహిన వర్గాల కు అండగా ఉంటాము అని తెలిపారు . ఈ కార్యక్రమంలో నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్ నల్లాచంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్, తిక్కిరెడ్డి సురేష్,గంపాల గోవింద్ , దార్లంక సురేష్,గోకరకొండ సాయిధర్, రావూరి మధన్ రావూరి స్వామి,వింటే ధిలిప్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ఎస్పీని కలిసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కప్పల సునీల్ కుమార్.

**ఆలమూరు, అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన రామచంద్రపురం జిల్లా కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కప్పల సునీల్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనాకు ఆయన బొకే అందించారు. ఇటీవల జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్ జిల్లా అధికారులను మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు.



## కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే అయితాబత్తుల

**అమలాపురం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాని కలిసి అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

## ముమ్మిడివరం మదర్ థెరీసా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదిమంది ఎయిడ్స్ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

**అమలాపురం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



నడక వ్యాయామం లో భాగంగా వాకర్స్ క్లబ్బులు నడకపై ప్రచారం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవకు అంకితం అవుతున్న వాకర్స్ క్లబ్ ల కార్యవర్గాన్ని వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు అభినందించారు. ముమ్మిడివరం మదర్ థెరీసా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు మెండి కమల చేస్తున్న సామాజిక సేవలను ఆయన ప్రశంసించారు. సోమవారం మధ్యాహ్నం అమలాపురం కూచిమించి వారి అగ్రహారంలో శ్రీకళా గ్రాండ్ రెసిడెన్సి ఏ.సి హాల్లో జరిగిన ముమ్మిడివరం మదర్ థెరీసా మహిళా వాకర్స్ క్లబ్ సమావేశంలో వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు ప్రసింగించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ బాధ్యత చిన్నారులు పదిమందికి పౌష్టికాహారం క్లబ్ తరఫున వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు అందజేశారు. నడక ప్రచారానికి తన కలం ద్వారా నిరంతరం కృషి చేస్తున్న నడకకవి నలానరసింహమూర్తిని ఆయన అభినందించారు. అనంతరం అమలాపురం లో నూతనంగాఏర్పాటైన హ్యాపీ లైఫ్ వాకర్స్ హెల్త్ క్లబ్ ను ప్రారంభిస్తూ నూతన కార్యవర్గం చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన క్లబ్ ను ఏర్పాటు చేసిన మెండి కమలను వాకర్ గవర్నర్ నాగేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా మదర్ తెరిస్సా మహిళా క్లబ్ అధ్యక్షురాలు మెండి కమల మాట్లాడుతూ ప్రతి నెలాతన క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షులు యడ్ల సురేష్ కుమార్ మాట్లాడుతూ తన క్లబ్బు నడక ప్రసారం తో పాటుసేవా కార్యక్రమాలకు ప్రతీ నెల రెండు రోజులు సమయాన్ని కేటాయిస్తానని ఆయన చెప్పారు ఈ సందర్భంగా క్లబ్బుకు అయిన వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా 20 వేల రూపాయలు అందజేశారు. క్లబ్ ఉపాధ్యక్షులు కుసుమ విజేష్,ఎస్. రాంబాబు ట్రెజరర్ గొల్లపల్లి గోపి జాలీవాకర్ నల్లా నరసింహమూర్తి సహాయ కార్యదర్శి జంగామణి లచేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కె..వి .రాఘవ దాక్షారామం మట్టా వెంకటేష్ కాకినాడ ఆత్మీయ అతిధులుగా పాల్గొన్నారు నడిపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బి. వి.వి సత్యనారాయణ.మాజీ సర్పంచ్ మడికి మరియమ్మ, గుర్రాల అమల పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## ఆదర్శప్రాయుడు సురేష్‌కి చిరు సన్మానం

**అమలాపురం అక్టోబర్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అమలాపురం,స్థానిక విద్యానిధి స్కూల్లో గని శెట్టి వెంకటేశ్వరరావు( బాబీ మాస్టర్), విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు మరియు స్కూల్ ప్రిన్సిపల్ తీగల మాధవి ఆధ్వర్యంలో ప్రముఖ సమాజ సేవకులు సురేష్ కి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా బాబీ మాస్టర్ మాట్లాడుతూ ఒంటరిగా దాతల సహకారంతో కొన్ని వందల కుటుంబాలకి సహాయం చేస్తూ సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలపై కూడా పోరాటం చేస్తున్న సురేష్ అభినందనీయుడు అన్నారు. నాయుడు మాట్లాడుతూ ఇంకా మంచి పనులు చేయాలని కొనియాడారు. సమాజంలో విలువల కోసం శ్రమిస్తున్న సురేష్ ని మాధవి ఆశీర్వదించారు.

# చివరి బెర్త్ కోసం హోరాహోరీ పోరు..

## భారత్ సెమీస్ అవకాశాలు ఇలా!

**మహిళల ప్రపంచకప్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే మూడు జట్లు సెమీస్‌కు అర్హత సాధించాయి. చివరిదైన నాలుగో స్థానం కోసం హోరాహోరీ పోరు నెలకొంది. ఇక వరుసగా మూడు అపజయాలతో భారత్ తన సెమీస్ అవకాశాలను క్లిష్టంగా మార్చుకుంది. చివరి బెర్త్‌ను దక్కించుకోవాలంటే టీమ్‌ఇండియా మహిళల జట్టు సమీకరణాలు ఎలా ఉన్నాయో చూద్దాం.**




టీమ్‌ఇండియా ఆడిన 5 మ్యాచ్‌ల్లో రెండింట్లో గెలిచి 4 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ (అక్టోబర్ 23), బంగ్లాదేశ్ (అక్టోబర్ 26)లతో తన తర్వాతి మ్యాచ్‌లు ఆడాల్సిఉంది. సెమీస్‌కు నేరుగా చేరాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో భారత్ తప్పక గెలవాలి.

ఒకవేళ ఒక మ్యాచ్‌లో గెలిచి.. మరోదాంట్లో ఓడినా టీమ్‌ఇండియాకు అవకాశం ఉంటుంది. రేసులో ఉన్న ఇతర జట్ల ఫలితాలపై అది ఆధారపడి ఉంటుంది. ఆ జట్ల కంటే మెరుగైన రన్‌రేట్ సాధిస్తే.. సెమీస్ రేసులో భారత్ ముందుంటుంది. ఒకవేళ భారత్.. తన రెండు మ్యాచ్‌ల్లో ఓడితే మాత్రం.. సెమీస్ బెర్త్ దాదాపు దూరమైనట్లే.

ఇక టీమ్‌ఇండియాకు సానుకూలాంశం రన్‌రేట్ పాజిటివ్‌గా ఉండటం. న్యూజిలాండ్ ఇప్పటివరకూ ఒక మ్యాచ్‌లో గెలిచినప్పటికీ.. రెండు మ్యాచ్‌ల ఫలితాలు తేలకపోవడంతో ఆ జట్టు ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. న్యూజిలాండ్ తన తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మాత్రం.. భారత్‌ను వెనక్కి నెట్టి సెమీస్ రేసులో ముందుకొస్తుంది.

సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. దీంతో దాని ఖాతాలో 4 పాయింట్లు చేరాయి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిస్తే శ్రీలంక కూడా సెమీస్ రేసులోకి వస్తోంది.

ఇక పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లు దాదాపు సెమీస్ రేసు నుంచి దూరమైనట్లే.

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా ఇప్పటికే నాలుగేసి మ్యాచ్‌ల్లో గెలిచి సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే.

**అవే తప్పులు.. మారని వ్యూహాలు..**

టీమ్‌ఇండియా మహిళా జట్టు వరుస మ్యాచ్‌ల్లో ఓటమిపాలవుతున్నప్పటికీ.. తన తప్పుల నుంచి నేర్చుకోవడం లేదు. చివరివరకూ వచ్చి తడబాటుకు గురవుతూనే ఉంది. చేతిదాకా వచ్చిన విజయాలను ప్రత్యర్థికి అప్పగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ ఇదే జరిగింది. వన్డే ప్రపంచకప్ కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ సేన తన వ్యూహాలు మార్చుకోవాలి. చివరివరకు పోరాడితేనే.. జట్టు విజయాల బాట పడుతుంది.

# ట్రోఫీ ఇవ్వని నఖ్వీ..

# వార్నింగ్ ఇచ్చిన బీసీసీఐ

**టీమ్‌ఇండియా ఆసియా కప్ విజేతగా నిలిచి 20 రోజులు దాటింది. అయితే, ఇప్పటికీ ట్రోఫీతోపాటు మెడల్స్.. భారత జట్టు చేతికి రాలేదు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఏసీసీ చీఫ్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చైర్మన్‌గా ఉన్న మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా వాటిని తీసుకొనేందుకు భారత క్రికెటర్లు నిరాకరించారు. దీంతో ట్రోఫీ, మెడల్స్‌ను తనతోపాటు నఖ్వీ తీసుకెళ్లిపోయారు. నఖ్వీ వ్యవహరిస్తున్న తీరుపై సీరియస్‌గా ఉన్న బీసీసీఐ ఆసియా కప్ ఫైనల్ ముగిసిన రెండ్రోజుల తర్వాత జరిగిన ఏసీసీ ఏజీఎం సమావేశంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.**




తాజాగా నఖ్వీకి బీసీసీఐ గట్టి వార్నింగ్ ఇచ్చింది. ట్రోఫీని సరైన పద్ధతిలో అప్పగించాలని, లేకపోతే ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు అధికారిక ఇ-మెయిల్ పంపింది. ఏసీసీ చీఫ్ నుంచి ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నామని, ఆయన వైపు నుంచి ఎటువంటి స్పందన రాకపోతే అధికారిక మెయిల్ ద్వారా ఈ విషయాన్ని ఐసీసీకి తెలియజేస్తామని బోర్డు కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఈ ప్రక్రియలో తాము దశలవారీగా ముందుకు సాగుతున్నామని, ట్రోఫీని భారత్‌కు తీసుకువచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామన్నారు.

ఏసీసీ కార్యాలయంలో భారత జట్టుకు ట్రోఫీ అందజేయానికి సిద్ధంగా ఉన్నానని నఖ్వీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. పాక్ మంత్రిగా ఉన్న మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ఎట్టిపరిస్థితుల్లో ట్రోఫీని స్వీకరించబోమని బీసీసీఐ తెగేసి చెప్పింది. ప్రస్తుతం ఆసియా కప్ ట్రోఫీ దుబాయ్‌లోని ఏసీసీ కార్యాలయంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, తన అనుమతి లేకుండా దాన్ని అక్కడి నుంచి తరలించడం లేదా ఇతరులకు అప్పగించొద్దని అధికారులకు నఖ్వీ ఆదేశాలు జారీ చేశారట.

# రిషబ్ పంత్ ఫిట్

# ఇండియా - A జట్టుకు నాయకత్వం

**అండర్సన్ - తెందూల్కర్ ట్రోఫీలో గాయపడిన రిషభ్ పంత్ టీమ్ ఇండియా రీఎంట్రీ ఖరారైంది. ఆ సిరీస్‌లో నాలుగో టెస్టులో పంత్ పాదానికి తీవ్ర గాయమైన విషయం తెలిసిందే. అయితే అతను కోలుకున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలొస్తున్నాయి. ఇప్పుడు బీసీసీఐ అధికారికంగా తెలియజేసింది. దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో త్వరలో జరిగే రెడ్ బాల్ సిరీస్‌కి భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు.**



ఈ నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ సిరీస్‌లో మన జట్టుకు వైస్ కెప్టెన్‌గా సాయి సుదర్శన్ ఎంపికవ్వగా.. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, మహమ్మద్ సిరాజ్ జట్టులో భాగమయ్యారు. అక్టోబరు 30 నుంచి నవంబరు 2 వరకు తొలి మ్యాచ్ జరగనుండగా.. రెండో మ్యాచ్ నవంబరు ఆరు నుంచి ఉంటుంది. ఈ రెండు మ్యాచ్‌లు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లోనే జరుగుతాయి.

**ఇండియా 'ఎ' జట్టు**

మొదటి మ్యాచ్‌కు: రిషభ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఆయుష్ మాత్రే, నారాయణ్ జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్, హర్ష్ దూబే, తనుష్ కొటియన్, మానవ్ సుతార్, అంశుల్ కాంబోజ్, యష్ ఠాకూర్, ఆయుష్ బదోని, సరాన్ష్ జైన్.

రెండో మ్యాచ్‌కు: రిషభ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబే, తనుష్ కొటియన్, మానవ్ సుతార్, ఖలీల్ అహ్మద్, ప్రమాన్ అహ్మద్, సిరాజ్, ఆకాష్ దీప్.

ఇంగ్లాండ్‌తో అండర్సన్ - తెందూల్కర్ ట్రోఫీ సమయంలో పాదానికి తీవ్ర గాయం కావడంతో రిషభ్ పంత్ విలవిల్లాడిపోయాడు. మధ్యలో క్రీజు వదిలి వెళ్లిపోయిన అతను.. ఆ తర్వాత గాయంతోనే వచ్చి హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. చికిత్స, విశ్రాంతి పూర్తవ్వడంతో తిరిగి ఇప్పుడు జట్టులో చేరుతున్నాడు. గాయం కారణంగానే వెస్టిండీస్ టెస్టు సిరీస్, ఆసియా కప్, ఆస్ట్రేలియా పర్యటనలకు పంత్ దూరమైన సంగతి తెలిసిందే.

# కేఎల్ రాహుల్ విషయంలో

# ఇది పద్ధతి కాదు

## టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్




**టీమ్‌ఇండియా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఇందులోభాగంగా ఆదివారం పెర్త్ వేదికగా మొదటి వన్డేలో ఆసీస్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో కంగారూ జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. పలుమార్లు వరుణుడు ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో తొలుత భారత్ 26 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 136 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం 131 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 21.1 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది.**

ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా టాప్ ఆర్డర్ తేలిపోయింది. రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లీ (0), శుభ్‌మన్ గిల్ (10), శ్రేయస్ అయ్యర్ (11) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. అయిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అక్షర్ పటేల్ (31), ఆరో స్థానంలో బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ (38) కాస్త పోరాడారు. దీంతో టీమ్‌ఇండియా ఆ మాత్రమైనా స్కోర్ చేయగలిగింది.

**డక్‌వర్త్ లూయిస్ విధానం సమంజసంగా లేదు: టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్**

అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో కేఎల్ రాహుల్ కంటే ముందు అక్షర్ పటేల్, శ్రేయస్ అయ్యర్ రావడాన్ని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుబట్టాడు. 'కేఎల్ రాహుల్.. శ్రేయస్ అయ్యర్ కన్నా ముందే బ్యాటింగ్‌కు రావాలి. అద్భుతంగా పరుగులు చేసే సామర్థ్యమున్న అతన్ని టీమ్ మేనేజ్‌మెంట్ విస్మరిస్తోంది. అక్షర్ పటేల్, రాహుల్ కన్నా ముందు బ్యాటింగ్‌కు వెళ్లడం అర్థరహితం' అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయం వెల్లడించాడు.

'అక్షర్ పటేల్ బాగా ఆడాడా? లేదా? అన్నది ఇక్కడ పాయింట్ కాదు. కేఎల్ రాహుల్ లాంటి అద్భుతమైన ఆటగాడు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉన్నప్పుడు అతడి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలి. అతడు కచ్చితంగా అయిదో స్థానంలో బ్యాటింగ్‌కు రావాలి. ఒకవేళ నేనే కెప్టెన్ అయితే.. అతన్ని నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు పంపుతా. ఉపఖండంతో పోల్చుకుంటే ఆస్ట్రేలియాలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. అందుకే అతడికి వీలైనన్ని ఎక్కువ బంతులు ఆడే అవకాశం ఇవ్వాలి. అలాగే నితీశ్‌కుమార్ రెడ్డిని కూడా బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించాలి. లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కోసం చూడకూడదు' అని శ్రీకాంత్ విశ్లేషించాడు.

# డక్‌వర్త్ లూయిస్ విధానం

# సమంజసంగా లేదు

## టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్




పెర్త్ వేదికగా టీమ్‌ఇండియా ఆసీస్‌ల మధ్య జరిగిన తొలి వన్డేకు పలుమార్లు వర్షం ఆటంకం కలిగించిన విషయం తెలిసిందే. దీంతో మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 9 వికెట్లు నష్టపోయి 136 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ విధానం ప్రకారం ఆసీస్ విజయ లక్ష్యాన్ని 131గా నిర్ధరించారు. అయితే దీన్ని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తప్పు బట్టాడు. ఈ విధానం సమంజసంగా లేదని తన యూట్యూబ్ ఛానల్ వేదికగా విమర్శించాడు.

**మొదటి వన్డేలో అతణ్ని ఆడించి ఉండాల్సింది..: మహ్మద్ కైఫ్**

'ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 136 పరుగులు చేసింది. కానీ టార్గెట్ 131గా నిర్ణయించారు. ఇది తప్పు, అన్యాయం. ఎందుకంటే.. మొదట మ్యాచ్ 50 ఓవర్ల గేమ్‌గానే ప్రారంభమైంది. కానీ పలుమార్లు వర్షం ఆటంకం కలిగించడం వల్ల ఓవర్లను తగ్గించారు. దీంతో టీమ్‌ఇండియాకు చాలా ఇబ్బంది ఎదురైంది. వికెట్లు ఎక్కువగా కోల్పోతే డీఎల్ఎస్ విధానంలో చిక్కులు ఎదురవుతాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయింది. అలాగే ఆస్ట్రేలియా బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్ ఏడు, మిచెల్ స్టార్క్ ఆరు ఓవర్లు బౌలింగ్ చేశారు. కానీ టీమ్‌ఇండియా బౌలింగ్‌కు వచ్చే సమయానికి బౌలర్లు వేసే ఓవర్లపై మరింత పరిమితి విధించారు. అలాగే ఆసీస్ బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి వారికి సాధించాల్సిన లక్ష్యం, ఏ భారత బౌలర్ ఎన్ని ఓవర్లు వేస్తారనే విషయంలో పూర్తి స్పష్టత వచ్చింది. ఇది వారికి అడ్వాంటేజ్‌గా మారింది' అని ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు.

అలాగే డీఎల్ఎస్ విధానం మొదట బ్యాటింగ్ చేసిన జట్టుకు కాస్త అనుకూలంగా ఉంటే బాగుంటుందని అతడు అభిప్రాయపడ్డాడు. 'టీమ్‌ఇండియా 136 పరుగులు చేస్తే.. ప్రత్యర్థి జట్టు టార్గెట్ 145 లేదా 147 ఉండాలి. కానీ డీఎల్ఎస్ నిబంధనలు మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వారికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ విధానంలో మార్పులు, చేర్పులు చేయాలి' అని ఆకాశ్ చోప్రా సూచించాడు.

మొదటి వన్డేను ఏడు వికెట్ల తేడాతో గెలిచిన ఆసీస్ ఈ సిరీస్‌లో 1-0తో ముందంజలో ఉంది. రెండో వన్డే.. గురువారం (అక్టోబర్ 23) అడిలైడ్, మూడో వన్డే.. శనివారం (అక్టోబర్ 25) సిడ్నీ వేదికగా జరగనున్నాయి.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## అమ్మలుక్‌ను రీ క్రియేట్ చేసిన నభా నటేష్..

ప్రస్తుత కాలంలో హీరోయిన్లు చాలామంది తమ తల్లులకు సంబంధించిన చీరలను మళ్లీ రీ క్రియేట్ చేసి ధరిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లకు తమ తల్లులు వారి పెళ్లిళ్లలో కట్టుకున్న చీరలకు.. ఇప్పటి ఆధునికతను జోడిస్తూ మరింత ట్రెండింగ్ గా మార్చేస్తున్నారు. ఇప్పటికే సమంత, నిహారిక ఇలా ఎంతోమంది హీరోయిన్స్ తమ పెళ్లిళ్ల సమయంలో తమ తల్లులు కట్టుకున్న చీరలను మళ్లీ రీ డిజైన్ చేయించి అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు దివాళి సెలబ్రేషన్స్ లో భాగంగా ప్రముఖ హీరోయిన్ నభా నటేష్ కూడా తన తల్లి కట్టుకున్న చీరను మళ్లీ డిజైన్ చేయించి కట్టుకోవడం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. ముఖ్యంగా తన తల్లి లుక్‌ను రీ క్రియేట్ చేస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## నేను సన్యాసం తీసుకునే అవకాశం కూడా ఉంది: రేణు దేశాయ్

- ‘టైగర్ నాగేశ్వరరావు’ సమయంలో వచ్చిన విమర్శలపై స్పందించిన రేణు దేశాయ్
- నన్ను విమర్శించిన వారు ఇప్పుడు క్షమాపణలు చెప్పరని వ్యాఖ్య
- నటన ఇష్టమే కానీ అదే జీవిత లక్ష్యం కాదని స్పష్టీకరణ



దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రవితేజ నటించిన ‘టైగర్ నాగేశ్వరరావు’ చిత్రంతో నటిగా రీఎంట్రీ ఇచ్చారు రేణూ దేశాయ్. ఈ సినిమాలో ఆమె సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రలో కనిపించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై తీవ్రమైన విమర్శలు వచ్చాయని, వాటిని చేసిన వారు ఇప్పుడు తనకు క్షమాపణ చెప్పరని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు. ‘టైగర్ నాగేశ్వరరావు’ సినిమా చేస్తున్నప్పుడు తనపై కొందరు విమర్శలు చేశారని రేణూ గుర్తుచేసుకున్నారు. “కమ్‌బ్యాక్ ఇచ్చింది కాబట్టి ఇకపై అన్ని రకాల సినిమాల్లో నటిస్తుందని, ఎక్కడ చూసినా తనే కనిపిస్తుందని రాశారు. కానీ ఆ సినిమా విడుదలై రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకు నేను మరే సినిమాలోనూ నటించలేదు, ఏ ప్రాజెక్టుకూ సంతకం చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని తెలిసి కూడా, నాడు విమర్శించిన వారు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు కదా? మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడతారు” అని ఆమె అన్నారు. నటన అంటే తనకు చాలా ఇష్టమని, కానీ అదే తన జీవిత లక్ష్యం కాదని రేణూ దేశాయ్ స్పష్టం చేశారు. “నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తానేమో. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను కానీ, దానికి అంత ప్రాధాన్యం ఇవ్వను. ఒకవేళ నటననే కెరీర్‌గా కొనసాగించి ఉంటే ఇప్పటికి మంచి పేరు సంపాదించేదాన్ని” అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తనకు మంచి పాత్రలు, మహిళా ప్రాధాన్యం ఉన్న కథలు వస్తున్నాయని రేణూ తెలిపారు. త్వరలోనే ఓ కామెడీ చిత్రంలో అత్త పాత్రలో నటించనున్నట్లు వెల్లడించారు. అత్తాకోడళ్ల మధ్య హాస్యభరితంగా సాగే ఈ సినిమా త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. తనకు ఆధ్యాత్మిక మార్గంపై ఆసక్తి ఎక్కువని, భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం కూడా ఉందని ఆమె పేర్కొన్నారు.

## బాలీవుడ్ సీనియర్ నటుడు అస్రానీ కన్నుమూత



బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అస్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జన్మించిన అస్రాని.. ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. అదే సమయంలో తన విద్యను పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో 1962లో ముంబయికి వెళ్లారు. అక్కడ దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. 1966లో విడుదలైన “హమ్ కహా జా రహే హై” సినిమాతో వెండితెరపై తొలి అడుగుపెట్టిన ఆయన, 1967లో వచ్చిన “హరే కాంచ్ కీ చూడియా”తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, “షోలే” సినిమాలో ఆయన పోషించిన జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350కిపైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. “హీరో హిందూస్థానీ”, “డ్రీమ్ గర్ల్ 2” వంటి చిత్రాల్లో కూడా ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. అంతేకాకుండా “చలా మురారీ హీరో బన్నే”, “ఉడాన్” వంటి సినిమాలకు దర్శకత్వం వహించి తన ప్రతిభను చాటుకున్నారు. బాలీవుడ్‌లో చిరునవ్వుల నటుడిగా పేరుగాంచిన అస్రాని మరణం సినీ ప్రపంచానికి పూడ్చలేని లోటు అని అభిమానులు చెబుతున్నారు.

## సైకిల్‌పై వచ్చిన ‘మన శంకర వరప్రసాద్..’

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వస్తున్న ‘మన శంకర వర ప్రసాద్ గారు’ మూవీ నుండి దీపావళి సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ‘మన శంకర వరప్రసాద్ తరపున అందరికీ దీపావళి శు భాకాంక్షలు చెబుతూ.. నవ్వుల టపాసులు సంక్రాంతికి పేలుద్దాం’ అని డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ పోస్టర్ కింద రాసుకొచ్చారు. నయనతార ఇందులో హీరోయిన్‌గా చేస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## ‘రోలుగుంట సూరి’ ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించిన రాజేంద్రప్రసాద్




విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామా ‘రోలుగుంట సూరి’ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ సినీనటుడు ‘నటకిరీటి’ రాజేంద్రప్రసాద్ ఘనంగా ఆవిష్కరించారు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలిపి హీరో హీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ... ”ఇలాంటి సినిమాలు సైలెంట్‌గా వచ్చి పెద్ద సంచలనం సఅష్టిస్తాయి. దర్శకుడు అనిల్ కుమార్ పల్లా హఅదయాన్ని తాకే సబ్జెక్ట్‌ని చాలా అద్భుతంగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఫస్ట్ లుక్ చాలా ఇంప్రెస్ చేసింది. సినిమా కూడా అలాగే అద్భుతంగా ఉండబోతోందనే నమ్మకం ఉంది, చిత్రయూనిట్‌కు అభినందనలు” అని అన్నారు. దర్శకుడు అనిల్ కుమార్ పల్లా మాట్లాడుతూ .... ”మా సినిమా ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించిన నటకిరీటి రాజేంద్రప్రసాద్ గారికి హఅదయపూర్వక కఅతజ్ఞతలు. ఆయన అభినందనలు మాకు మరింత నమ్మకం, ఉత్సాహం ఇచ్చాయి. అదే ఉత్సాహంతో సినిమాను మరింతా అద్భుతంగా చిత్రించి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా కఅషి చేస్తున్నాం,” అని తెలిపారు. నిర్మాత సౌమ్య చాందిని పల్లా మాట్లాడుతూ... ”’రోలుగుంట సూరి’ ఒక రియలిస్టిక్ విలేజ్ డ్రామా. భావోద్వేగాలతో, జీవిత సత్యాలతో మిళితమైన ఈ కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. మా టీమ్‌లో ప్రతి ఒక్కరు అద్భుతంగా తమ ప్రతిభను చూపుతున్నారు. ఈ సినిమా తెలుగు సినీ చరిత్రలో నిలిచిపోయేలా అవుతుందనే నమ్మకం మాకు ఉంది,” అని తెలిపారు. ఇలాంటి సినిమాలు గ్రామీణ జీవన శైలిని, భావోద్వేగాలను నిజ జీవితానికి దగ్గరగా చూపిస్తాయని యూనిట్ సభ్యులు తెలిపారు. ‘రోలుగుంట సూరి’ ప్రేక్షకుల హఅదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

## నేడు ‘చౌదరి గారి అమ్మాయి’ ట్రైలర్




ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ఫ్లస్ సంస్థ నిర్మించిన సినిమా ‘చౌదరి గారి అమ్మాయి’. కథానాయకుడు వినరుతేజ్, రిషిత కథానాయిక. సిద్ధార్థ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం ఉదయం విడుదల చేయనున్నామని దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని తెలిపారు. విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## ‘సినీమాయ’ కొత్త పోస్టర్

అనీష్ అయక్కర, విజరు, రోహిత్, ఆశా సస్మిత, మీనాక్షీ తదితరులు ప్రధాన తారాగణంగా రూపుదిద్దుకున్న సినిమా ‘సినీమాయ’. రాజాసాగి సత్యనారాయణ రాజు (కుర్రబాబు) నిర్మాతగా, గిరి చిన్నా దర్శకత్వంలో అనఘ దేవి మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ప్రచార పోస్టర్‌ను సోమవారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. డిఒపి ఎస్.ప్రసాద్, జయసూర్య, ఎడిటింగ్ పి.శ్యామ్‌కుమార్, సంగీతం ప్రమోద్‌కుమార్ పరిసర్ల అందించారు.




## ‘కింగ్ 100’లో మెగా స్టార్?



టాలీవుడ్ నటుడు కింగ్ నాగార్జున ఇటీవల తమిళ చిత్రనిర్మాత ఆర్ఐ దర్శకత్వంలో తన మైలురాయి చిత్రం 100వ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నాడు. తాత్కాలికంగా కింగ్ 100 పేరుతో రానున్న ఈ చిత్రం కోసం అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకి ‘లాటరీ కింగ్’ టైటిల్ ని లాక్ చేయటానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో నటుడు డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారు. తాజాగా ఇప్పుడు లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం, ఈ సినిమాలో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ ప్రత్యేక చిత్రంలో నాగా చైతన్య మరియు అఖిల్ అక్కికినిని అతిధి పాత్రలు చేస్తారని కూడా వార్తలు వస్తున్నాయి. నాగార్జున యొక్క అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. ఈ చిత్రానికి సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ స్కోర్ చేస్తున్నారు. ఈ సినిమా షఉటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339